## కార్మిక ఐక్యత మే డే !!

మేమంతా శ్రామికులం
కష్టించే కార్మికులం
తరతరాల వారసులం
తరిగిపోని సంపదలం,

శ్రమిస్తేనే ఆదాయం
శ్రమిస్తేనే ఆరోగ్యం
శ్రమిస్తేనే సౌభాగ్యం
శ్రమే మనకు సదుపాయం.

కులవృత్తులు పరిశ్రమలు
కుటీర పరిశ్రమలు
రకరకాల పరికరాలు
సమకూర్చే పరిశ్రమలు.

శ్రమతోనే చమట పట్టు
శ్రమలోనే రసపట్టు
శ్రమే కదా ప్రగతి మెట్టు
శ్రమకు సదా జై కొట్టు !!.

మేడే నే – మాడేయని
మేధిని కార్మికులంతా
ఐకమత్యమును చాటే
ఆ రోజే ఒక పండుగ !!



–రసస్రవంతి –కావ్యసుధ
9247313488

## శ్రమ చిరునామా

కాసిన్ని గంజినీళ్లు కడుపులో
ఇంధనంలా పోసి
కరముల యంత్రాన్ని తిప్పుతూ
అలసటను అదిమిపట్టి
స్వేదంలో ఈదుతూ..
ఇనుమును సైతం కరిగించి
పలు రకాల ఆకృతులకు
జీవం పోస్తాడు శ్రామికుడై.

ఆనాడు త్రేతాయుగంలో
వానర సైన్యం
సంద్రంలో తెలియాడే
వారధిని నిర్మించినట్టుగా..
ఈనాటి అలుపెరుగని
శ్రామిక సూరీడు నిరంతర
కృషి కిరణాలతో నింగిని తాకే
భవన నిర్మాణానికి
గిరులను తురిమి పునాది
రాయిలా వేస్తున్నాడు కార్మికుడై.

తలరాతల భారాన్ని నెత్తిన
మోస్తూ విధిరాతకు ఎదురెళ్లి
కండ బలాన్ని గుండె ధైర్యంతో
నింపుకొని శ్రామిక జీవనానికే
అంకితం అవుతున్నాడు
ఉక్కు కార్మికునిగా
శ్రమకు చిరునామాగా..



–కర్రి. మల్లీశ్వరి.
9493641584.



## అసలైన సౌందర్యం

భారాలేవేవో భుజాలను ఎక్కుతుంటే
బండరాళ్ళు గుండ అవుతుంటే
గనిలో ప్రమాదపుటంచులలో
మండే నిప్పులకొలిమి చేరువలో
భుజ బలమే ప్రవాహాలను దాటిస్తుంటే
దుక్కిదున్ని చేలలో
మట్టిని బంగారం చేస్తుంటే
విరబూసిన శ్రమపుష్పాలు దేహంపై
స్వేదం గా చింది తృప్తినిచ్చినపుడే..
ఇనపకండరాలు కరగదీసిన కష్టం
కడుపునిండా తిండి పెట్టినపుడే..
రేయింబవళ్ళు తేడాలెరుగని ఆరాటం
బతుకున పూలబాట పరిచినపుడే..
శ్రమజీవన సౌందర్యం తెలిసేది.

ఒంట్లో నెత్తుటిని స్వేదంగా మార్చిన కష్టం
ఆనందాల అందలమెక్కించినపుడు
అకుంఠిత దీక్షకి దక్కిన విజయఫలాలు
ఆత్మవిశ్వాసానికి ఎదురులేదనుకున్నప్పుడు
ఆశలచిరుజల్లులు ముంగిట కురిసినపుడు
అనుకుంటా అదే శ్రమజీవన సౌందర్యమని.

శ్రమసౌందర్యానికి ఖరీదు కట్టే
షరాబు ఉన్నాడనిపించినపుడు
అంతస్తులు అంతరాలెరుగని
కార్మిక కర్షక వర్గం శ్రమని ఒట్టిభ్రమ
అనుకోని నాడు శ్రమజీవనమే
అసలైన సౌందర్యం అనుకుంటాను



– డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి,
9849331554

## జీవన దాతలు

నారు పోసి
నీరు పెట్టి
పైరుపాపను
కంటి పాపలా
లాలించే రైతుశ్రమ
జాతికి అన్నం పెడుతోంది.

యంత్ర భూతాల
కోరలు తోముతూ
పగలూ రాత్రీ
కార్మికులు చిందించే
చెమటబిందువులు
లోకానికి సంపదను
సృష్టిస్తున్నాయి.

బండలు కొడుతూ
బరువులు మోస్తూ
రిక్షా లాగుతూ
కనిపించే శ్రామికుల
కష్టంతో విశ్వజీవన
చక్రం కదులుతోంది.

మానవశక్తి లేకపోతే
యంత్రశక్తి కదులుతుందా?
సంపద సృష్టించేదొకరు
దానిని అనుభవించేదొకరు
ఎన్నాళ్ళీ దురన్యాయం
ఎన్నేళ్ళీ దౌర్జన్యం.

బలవంతుల చేతుల్లో
చిక్కిన కర్షక కార్మిక
శ్రామిక వర్గాల్లో
వెలుగేది?వెన్నెలేది?
సాంత్వనమేది?
వారు బలహీనులనుకొంటే
పోరుబాటే
విప్లవాలు
ఉద్యమాలు
చరిత్రగతినే మార్చాయి.

ఆ శ్రమజీవులే
సౌఖ్యజీవన దాతలు
వారికి ఇవే సిరిజోతలు

–మంకుశ్రీను
8985990215

## శ్రామిక రాగం

జబ్బకి గుడ్డసంచీ తగిలించుకుని – బయలెల్లినాడు ఆ శ్రామికుడు....
చద్దిమూట, చినుగుల చొక్కా– ఇవే అతని ఆస్తిపాస్తులు....
ఆ పూటకు పని చిక్కితే– ఆతని పెయ్యపై విరిసేను హరివిల్లు!!

తెల్లవారంగనె – దొరల గడీలకు మల్లబోవాల,
లేదంటె– అడ్డా గాడికి బోవాల, రోజంతా కష్టం సేయాల!!
పొయ్యియలకుండ రొట్టె కాలాల–
రెండు ఇటికల నడుమన పుల్లలెలగాల – ఆడి డొక్క నిండాల!!
కండ్లల్ల నీళ్లు ఎండినై – గా పుల్లలు మటుకు కాదు!!
పొయ్యి ఎలగలేదు – రొట్టె కాలలేదు!!
అంటుకోని గా పొయ్యి – ఆడి డొక్క మటుకు మాడ్చింది....

పొగను జూసి – దారినబోయే కుక్క పరిగెత్తుకొచ్చింది–
రొట్టె ముక్క దొరుకుతుందేమోనని – వెర్రి ఆశ దానికి!!
అసలుకే లేకపోతే సిసలుకెక్కడిది?విసయం తెల్వక దోస్తాన జేసింది!!

రోజులు,వారాలు,నెలలు...
కాలం మారుతున్న వాడి బతుకు చిత్రంలో– మార్పు మాత్రం లేదు!!
దసర,దీపావలి వస్తె...వాడి రగతం ఇంకబెడతయి
ఇంట్లోల్ల మొగాలు జూస్తె – ఏడుపు ఏరులైతది......
బుడ్డోనికి మిఠాయి లేదు, బుడ్డదానికి జుబ్బా సుత లేదు,
దొరల బిడ్డల దాబు జూసి – మురుస్తున్న పిచ్చి మొగాలవి!!

కాళ్ళు,చేతులు కాయలుగాసి – ఒంటిని నిండుగ కప్పెడి బట్టలు లేక,
ఎండిన డొక్కలతో, తినీ–తినక, తల దాచుకునేందుకు నీడలేక,
కటికనేలపై సేదతీరు....
పూట గడవటం సుత గగనమైన బతుకు సిత్రమిది,
శ్రామిక రాగపు గమకాల లయయిది!!

నేను మటుకు ప్రత్యక్షంగా చూడలేదు....
నాకు తెలిసింది – సుకుమార శ్రామిక గీతం!!
దీని గతి మరీ విచిత్రం...
ఎండ కన్నెరగరు, చల్లటి గదుల్లో మగ్గుతుంటరు,
శరీరం అలవదు, కొవ్వు కరగదు, కానీ....శ్రమ అనంతం!!
లక్షల్లో జీతాలు – మనశ్శాంతి లేని జీవితాలు!!
తిండికి లోటు లేకున్న– తినే తీరికలేని బతుకులు!!
ఉన్నదాంట్లో దొరకని తృప్తి – లేనిదానికై నిత్యం కుస్తీ!!
వేళ పాళ లేని శ్రమ– శారీరికం మాత్రమే కాదు మానసికం కూడా!!
అలుపు–సొలుపు లేక మూటకట్టుకున్న రోగాలు,
మందులకు కూడా లొంగని మొండి జబ్బులు....
విలువలు మరిచి,వలువలలో విచిత్ర పోకడలతో...
బంధాలు బంధుత్వాలు అన్నీ బూటకాలు,
ఆన్లైన్ లో బతుకులు, అబద్దపు మొకాలు,
అబ్బో!! సెకను, సెకనుకు మారే
డి.పీల మోతలు, తీరని వెతలు....
అదండీ...ఆసాంతంగా శ్రామిక రాగం!!

– శ్రీసుధ కొలచన,
9440470674

## కార్మిక శక్తి

కార్మికుడు లేని లోకం
శ్వాసించనిదేహం
వికసించని కుసుమం
ఉదయించని ఆకాశం.

శ్రామికుడున్న జగం
ప్రసరించిన కిరణం
వ్యాపించిన పరిమళం
విశ్వవ్యాప్తమైన జ్ఞానం.

వేసుకున్న చెప్పులు
ధరించిన దుస్తులు
రాసుకున్న పరిమళం
పూసుకున్న అత్తరు.

నిద్రలేచినప్పటి నుండి
నిద్రపోయేంతవరకు
తోముకునే బ్రష్ నుండి
పడుకునే మంచం వరకు.

అన్ని కార్మికుల చెమట చుక్కలే
శ్రామికుల శ్రమ ఫలితాలే
కాలేకడుపులతో కష్టించి
మన కడుపు నింపు కార్మికులే
ఇందుగలడందులేడని సందేహం
వలదు కార్మికులు సర్వోపగతు
లెందెందు వెదకి చూసిన
అందందే గలరు
మహిలో సత్యంబు సుమా!



–డా.వైరాగ్యం ప్రభాకర్
9014559059



## శ్రమ జీవులరా ఏకంకండి

కార్మికులారా, కర్షకులారా
శ్రామికులారా,
నెత్తురు చెమటను
చిందించే శ్రమజీవులారా
ఏకంకండి, ఏకంకండి.

అదిగదిగో మీ హక్కులను
కాలరాసే కార్పొరేట్ రాకాసులు
మీ రక్తంని పీల్చుకునే జలగలు
పొంచి వున్నాయి పొడుచుకొని
తినడానికి,
మంచె నున్నాయి మింగేయడానికి
మాయ మాటలు చెప్పి,
మీలో తగవులు రేపి,
అన్నతమ్ముళ్లు వలె కల్సి పోరాడే
మీలో అనైక్యతను పెంచడానికి
కుట్రలు పన్నుతున్నాయి
ప్యాకేజీలు ఇస్తామంటూన్నాయి
వారి ఉచ్చులో పడొద్దు
ఏకంకండి, ఏకంకండి
శ్రమించే శ్రామికులారా
ఎప్పటి నుంచో ఈ పోరాటం
ఎన్ని మేడేలు వచ్చినా ఏమి ఫలం
ఏం సాధించినది కార్మిక లోకం
ఎందరు బతుకులు మారాయి
ఈ దినం
ఎనిమిది గంటలు పని వేళలొచ్చినా
ఇంకా ఏదో అసంతృప్తి,
కార్మిక సోదరులు కుటుంబాలలో
ఎంత మంది
పారిశ్రామికవేత్తలయ్యారు
ఎంత మంది
ముప్పూటాలా సుఖజీవనం చేసారు?
భూమి వలె తిరుగాడే మీ కాళ్ల
నడక లేనిదే ఏ పరిశ్రమ సాగుతుంది
నక్షత్రం వలె మెరిసే
మీ కళ్లు పడకుండా
ఏ ప్రగతి సాగుతుంది
సోదరులారా
కల్సి రండి, కదలి రండి
మీ బతుకులు మారేందుకు
సంఘటితమై పోరాడండి
ఆ రోజే మే డే
పెత్తందారీ వ్యవస్థకు డెడ్ డే



–విశ్వనాథ నరసింహం
9490971589

## జయహో కార్మిక

జయ జయహో కార్మికా
దేశాభివృద్ధికి నీవే దీపిక
కర్మాగారాలలో నీ కష్టం దేశ పురోగతికి లక్ష్యం
సాంకేతిక రంగానికి నీవే వెన్నెముక
ఇరవైనాలుగు గంటలు పనిచేసే విశ్రాంతి ఎరుగని
మీ శ్రమ దేశమాత అభ్యున్నతికి అర్పణం
ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలం
కార్మికా నీకు శతకోటి వందనాలు..
పగలు రేయి కుటుంబ క్షేమం బిడ్డల భవిష్యత్తు చూడక
కష్టాన్ని నమ్ముకుని కదలి పోతున్నావు . . .
ప్రభుత్వం నీకు సరిపడా కుటుంబ సంక్షేమ పథకాలు ఇవ్వకపోయినా
శ్రమ శక్తిని నమ్ముకుని దేశ ఔన్నత్యా నికి పాటు పడుతున్నావు
అందుకే అంతర్జాతీయ కార్మికులంతా మే ఒకటో తేదీని
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం గా జరుపుకుంటున్నారు...
ఎందరో కార్మికులు తమ రక్తం చిందించి పోరాడి తెచ్చుకున్న
రోజు మే డే. కొంతవరకూ కార్మికులకు విశ్రాంతిని ఇచ్చిన రోజు
మే డే .... కార్మికుల దినం....
నీ కష్టాలు నష్టాలు మీ కుటుంబ క్షేమం
దిగ్విజయం కావాలని ఆశిస్తూ అభినందిస్తూ దీవిస్తున్నాను .
జయహో కార్మిక అనంత కోటి వందనాలు నీకు......



–శ్రీమతి సత్య మొంద్రేటి ,
94909581

## ఆకాశ హర్మ్యాల నీడలో...

ఎక్కడ చూసినా
కనిపిస్తున్న దృశ్యాలే అవి
విలాసవంతుల జీవితకాలం
అక్కడే గడిచిపోవాలనే
వారి ఆకాంక్షల వెల్లువకు
అనుగుణంగానే వెలుస్తున్నాయి
బహుళంతస్తుల భవనాలు
అదేమీ పెద్ద కుటుంబం కాకున్నా
లింగూ లిటుకూమంటూ
ఒకరిద్దరున్నా
నివాసమదే కావాలనుకుంటుంది
నేటితరం
నాగరిక సమాజంలో ఉబికి వచ్చిన
పెను మార్పుల వలయంలో
చిక్కుకుపోయి విలవిలలాడే
శ్రమజీవుల ఆవాసం
ఆకాశహర్మ్యాల నీడలో
కనపడిన ప్రతివారూ
మీ ఇల్లెక్కడంటే
ఇక్కడ ఇళ్ళన్నీ పూర్తయ్యేదాకా
ఈ పూరి గుడిసే
చెప్పలేక చెప్పే ఆ జవాబుకు
మళ్ళీ ప్రశ్న ఎక్కడుంటుంది?
కట్టుకున్న వాడితో కలిసి
కట్టుబడి పనికెళ్ళే ఆమెకు
పిల్లల్ని గాలికొదిలేయక తప్పదు
ఆ స్వేద జలపూరిత
వేదనాభరిత జీవితాలకు
ఉచితాలెన్ని అందించినా
అవి మాడిపోతున్న
కడుపులపై చల్లే
ఒక నీటి చుక్క మాత్రమే అవుతుంది
సహాయమడిగితే నిట్టూర్చేదొకరు
నిరాకరించేది మరొకరు
భిన్న మనస్తత్వాల నడుమ
అణిగిమణిగి
చాలీచాలక పస్తులుండో
బొటాబొటీగా గడుస్తుండో
జీవితాలను వెళ్ళబుచ్చే
కష్టజీవుల ఓపికంతా కరిగిపోయి
చెలరేగే రోజులెప్పటికైనా
ఆసన్నమవుతాయి



–పొత్తూరి సుబ్బారావు,
సెల్:9490751681

## శ్రమ

కార్మికుని అపారమైన శ్రమకి విలువ ఇస్తూ అప్పుడెప్పుడో వియయవంతంగా జరిగిన కార్మిక విప్లవంకి గుర్తుగా కార్మిక దినోత్సవాన్ని మే నెల ఒకటవ తేదీన జరుపుకుంటారు.

ఆ పాత జ్ఞాపకానికి గుర్తుగా సమావేశాలు జరుపుకోవడం, కార్మికులలో నూతన ఉత్తేజం నింపడానికి జరిపే ప్రయత్నాల వరకూ కార్మికదినం జరుపుకుంటే ఉత్తమం.

అన్ని రంగాల్లో ఉత్తమ కార్మికులకు సన్మానాలు జరిపితే అతి ఉత్తమం, ముదావహం.

కానీ, మన దేశంలో ప్రస్తుతం కార్మికదినం సెలవరోజు గానే 95 శాతం పైన జనం పరిగణిస్తున్నారు అని అనుకోవడం ఏ మాత్రం సత్య దూరం కాదు.

పాత జ్ఞాపకాలతో నిండిన నూతన ఉత్తేజంతో కనీసం ఆ ఒక్క రోజైనా శ్రామిక ఉత్పాదన పెంపుదల కళ్ళ చూడడం, అలా చూడాలని అనుకోవడం, ఆశించ దగ్గ పరిణామం.

కానీ, ఆరోజు సెలవుదినం అవడంతో కార్మిక ఉత్పాదన శూన్యం అయిపోతోంది. కనుక, అది ఎంత మాత్రమూ హర్షించదగ్గ విషయం కాదు.

ఈ ఆలోచన(లు) ఒక ఎత్తైతే ?

రోజువారీ కూలీ, కార్మికదినం పేరిట పని చేసుకొనే సదుపాయం లేక ఆరోజు తానూ తన కుటుంబం పస్తులుండడం ఎంతవరకూ సబబు.

ఇది గ్రహించకుండా, రాజకీయపార్టీలు కూడా సమావేశాలు పేరుతో మరియు సెలవు దినాన ఎవరూ పని చేయరాదు అన్న ఆంక్షలతో, రోజువారీ కూలీ జనాన్ని వారి వారి కుటుంబాలను పస్తులుంచడం ఎంతవరకూ గణనీయం అని ఆలోచించాలి.

శ్రమకి తగిన గుర్తింపు – ఆ శ్రమకి తగిన ఫలితం పొందడం. కానీ, నేటి రోజులలో శ్రామికుడి / కర్షకుడి శ్రమని రాజకీయ నాయకులు, దళారులు, ఎంత వీలయితే అంతగా దోచుకుంటున్నారు అన్నది జగమెరిగిన సత్యం.

దీని పరిణామం – శ్రామికుడు / కర్షకుడు శ్రమ పడుతున్నాడు కానీ శ్రమకి తగ్గ ఫలితాన్ని పొందలేక సంవత్సరాలు – చివరికి దశాబ్దాలు – గడుస్తున్నా ఆతని జీవనప్రమాణంలో ఏ మాత్రం మార్పు రావడం లేదు.

ప్రతీ రాజకీయనాయకుడు శ్రామికులలో / కర్షకులలో బీదరికాన్ని తొలగించడానికి నడుం కట్టుకున్నాం అన్న శబ్ద ఘోషతో ఎన్నికలప్పుడు ప్రచారాలు చేసి, ఆ ప్రమాణాలను నమ్మిన శ్రామికుల / కర్షకుల ఓట్లు సంపాదించుకొని, ప్రభుత్వంలో పదవులు సంపాదించుకున్న మరుక్షణం ? శ్రామికులను / కర్షకులను తమ పరిసరాలలోకి కూడా రానివ్వక ఎంత ఎక్కువ దూరమైతే అంత దూరం ఉంచుతున్నారు.

ఫలితం – శ్రామికుడికి / కర్షకుడికి శ్రమ పడడమే తెలుస్తుంది కానీ ఆతని శ్రమకి తగ్గ ఫలితం రావడం లేదు, ఎలా రాబట్టుకోవాలో తెలియదు.

అప్పుడెప్పుడో వచ్చిన **'రాముడు భీముడు'** సినిమాలో ఉన్న **'ఉందిలే మంచి కాలం ముందు ముందునా'** అని శ్రామికులు / కర్షకులు ఇప్పటికీ పాడుకుంటూ భవిష్యత్తుని ఆశాజనకంగా ఊహించుకుంటున్నారు.

వారి ఆశలు ఒక రోజైనా ఫలించాలని ఆశిద్దాం.

అలా ఫలితం రావాలంటే --

ప్రతీ శ్రామికుడు / కర్షకుడు కల్లుకి దూరంగా ఉంటూ నిరక్షరాస్యతకుదూరంగా ఉంటూ తోటి శ్రామికులతో / కర్షకులతో సమైక్యంగా తమ హక్కుల కోసం ఒక్క త్రాటిమీద నిలబడి పోరాడినప్పుడే ఆ పాటలోని ప్రతీ పదం నిజమై కళ్లయెదుట ఉన్నతి కనిపిస్తుంది.

శ్రామికుడి / కర్షకుడి శ్రమకి తగ్గ ఫలితం నూరు శాతం చేజిక్కించుకునేందుకు మరొకసారి విప్లవం రావాలేమో.



–మద్దూరి నరసింహమూర్తి,
9164543253,

## ప్రభ..!

తనువుని తాకిన చొక్కావెనుక
దయనీయమైన దర్జీ బ్రతుకుంది.
ఆకలి తీర్చినమెతుకుల్లో
దేశపు వెన్నెముక స్వేదం ఉంది.

నిర్మించిన ఆకాశ హార్మ్యం లో
దిన కూలీల కరాల కష్టం ఉంది.
పూసినపౌడర్ అద్దిన అత్తర్లలో
శ్రమతత్త్వపు శోభ ఉంది .!

రాసిన పెన్ను..కెమెరా కన్నూ
ఇంట్లో ఏ. సి,చేతికి వాచీ
తిరిగే ఫంకా... కరిగే హిమక్రీమ్
అన్నింట్లో తనుంటుంది.
అవనికే ఆయువు అవుతుంది.

కరాల్లో సత్తువ చూపి
నరాల్లో శక్తిని నింపి..
దేహాన్ని దుమ్ము ధూళిలో ఆరేసి
నిరంతరం పరిశ్రమించే
పరమాత్ములు వాళ్ళు..!

ప్రాతః కాలం మొదలు కొని
శయన మందిరం చేరే వరకూ..
ప్రతీ వస్తువులో..
శ్రమ పరిమళమై గుభాళిస్తూ
ప్రపంచ ఉనికికి 'ప్రభ' అవుతుంది.



–కోరాడ. అప్పలరాజు
అనకాపల్లి.

## శ్రమ

రెక్కాడితే గాని డొక్కాడదు
రెక్కలు ఆడించి ఆడించి డొక్కలు ఎండిపోతున్నాయి
చిత్రం ఏమిటంటే ఏ డొక్కలు కోసం రెక్కాడుతున్నారో....
ఆ డొక్కలే ఎండిపోతున్నాయి.

చెమట చుక్క చిందిస్తే గాని రక్తపు బొట్టు జనించదు
చెమట చుక్కలు చిందించీ చిందించీ రక్తపు బొట్లు ఆవిరైపోతున్నాయి
చిత్రం ఏమిటంటే ఏ రక్తపు బొట్లు కోసం
చెమట చుక్కలు చిందిస్తున్నారో....
ఆ రక్తపు బొట్లే ఆవిరైపోతున్నాయి
అయిననూ శ్రమ జీవనం కొనసాగిస్తునే ఉంటారు.

ఎండా లేదు కొండా లేదు
వానా లేదు కోనా లేదు
నిత్యం గడియారం లోని సెకండ్ల ముల్లు వోలె
పని చేస్తునే ఉంటారు.

పని ఎంత ఉన్నా ఫలం సుంతనే
పనిలేకున్నా పాపం పస్తులే.

పూటకూటికి నోచుకోని పరిస్థితి
కడుపు కాలి ఆకలి చావుల దుస్థితి

జీవనానికి లేదుగా సరైన ఆవాసం
మురికివాడల్లో మట్టి గోడల నివాసం.

బ్రతుకీడ్చడానికి వారుపడే కష్ట ప్రదర్శనం
కాయదేరిన చేతులు, పుండ్లు పడిన పాదాలే నిదర్శనం.

బానిస బ్రతుకుల బాటలో నడిచే వారి పయనం
సంకెళ్లు తెంచి బావుటా ఎగరవేసేదెప్పుడో తెరిచి వారి నయనం.

శ్రమ దోపిడీ చక్రాల క్రింద నలిగి చితుకుతున్న వారి జీవనం
శ్రమకు తగిన ఫలంబు కొరకు కదంతొక్కాలి ఈ కవనం

–శివశ్రీ

## శ్రమైక జీవనం

ప్రాణము లోన పుట్టు సర్వము తానౌను
విశ్వదాభిరామ వినురవేమ
అన్న వేమన వచనం అక్షర సత్యం
నేటి నాగరిక నరుని ఉనికి సర్వం
అవిశ్రాంత శ్రమైక జీవన ఫలితం.

మానవుడావిష్కరించిన సర్వ సౌకర్యం
మానవుడనుభవిస్తున్న ప్రతి వైభోగం
విజ్ఞానం, సంప్రదాయం, సంస్కారం
మొత్తం శ్రమ సాధించిన ఘన విజయం.

కష్ట పడి చిందిస్తే స్వేదం
రుధిరం దాలిస్తే చెమట రూపం
ఒళ్ళు దాచక పని చేస్తే నిత్యం
సకలం కాగలదు పాదాక్రాంతం.

శ్రమ తోనే పరిశ్రమలకు ఊతం
పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యం
కొండను పిండిగ చేసే హస్తం
జలధి లంఘించిన పాదం
గంగను ఇలకు దింపిన యత్నం
గిరిని చిటికెన వేలుతో మోసిన కరం
తెలుపలేదా శ్రమకున్న ఫలితం.

శ్రామికుల అవిరామ రెక్కల కష్టం
అవనికందిస్తున్నది సౌఖ్యాల సౌధం
శ్రమ దోపిడీకి చెల్లి పోయింది కాలం
శ్రమ జీవికి లేదెపుడు భుక్తి లోపం
శ్రమ జీవికి లోకమంతా లక్ష్మీ నివాసం.
పిండి కొద్దీ రొట్టె అన్న చందం
శ్రమ కొద్దీ లభించు ఫలితం
శ్రమ లోకాన్ని నడిపించు శ్రీచక్రం



–జె వి కుమార్ చేపూరి
96407 12062

## శ్రమైక సారథులు

అనాథులం
అభాగ్యులం
భవ్యమైన దేశంలో
శిథిలమైన బ్రతుకులం.

బంగారు దేశానికి
శ్రమైకసారథులం
మా భుజస్కందాలపై
దేశ భవన నిర్మాణం.

అన్నదాతలం మేము
ఆరుగాలల కూలీలం
అలుపెరుగని హాలికులం
గుర్తింపు లేని కర్షకులం.

కండరాల బిగువుతో
కరాల సత్తువతో
కర్మాగారాలను
కదిలించే శక్తులం
కష్టజీవులం
కన్నీటి కార్మికులం.

శ్రమని దోచుకోక
పరిశ్రమని గుర్తించి
సమస్త వృత్తుల శక్తుల
శ్రమైక జీవన సౌందర్యానికి
సాటి లేదని నినదిద్దాం
కార్మిక కర్షక శ్రామికులకు
చేద్దాం సహస్ర వందనాలు



–మానాప్రగడ సాహితి
9989370358

## శ్రమ జీవులు

కాలం ఒడిలో సేద తీరే శ్రమ జీవులు
శ్రామిక జీవన వారసత్వంలో
ఎందరో అభాగ్యుల
వెలుగులు
చిమ్మచీకటి వెలుగులే....!
రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు
ఆశల కొంగుల్ని బతుకు తీరంలో
తివాచీలా పరుస్తారు....!
నిస్వార్థ పయణమే లోకం పోకడకు
చెంపపెట్టు
ఎర్రని సూర్యులై రగిలేఘోషలో
ఆవేదనల సురగోళాలెన్నో...!
తీరని ఆకలి కాలం
ఓదార్చని బలిసిన వైనాలు
వెక్కిరింతల కథలు...
ఎన్ని అగాధాలను మోసినా
ఓడవని బతుకు పోరు...!
మట్టిలో మాణిక్యాలై సమసమాజానికి
తరువులై నిలిచే శ్రమతత్త్వపు వీరులు!
తరతరాల చరితలో చరితల సాక్ష్యాల
చైతన్య గీతికలు
శ్రామికుల పర్వదినపు
సంతోషపు వెల్లువలే
స్వేచ్ఛాహక్కుల విజయాల్లో
ఎంత ఆనందమో కదా!!



–చిందం సునీత
9701075502

## శ్రామిక గీతం

పల్లవి :
కార్మికులం కర్షకులం
అలుపెరుగని శ్రామికులం
ఎండావానకు సహచరులం
దేశ ప్రగతికి ప్రతిరూపాలం
॥కార్మికులం॥

చరణం :
బండలనే పిండిచేసినా
బతుకు భారమైన బడుగులం
రెక్కలనే ముక్కలు చేసినా
రొక్కమే మిగలని కూలీలం
॥కార్మికులం॥

చరణం :
కార్మాగారంలో కష్టమెంత చేసినా
కలలు ఫలించని కర్మజీవులం
చెమటోడ్చీ శ్రమను పంచినా
ఫలితమెరుగని సేవకులం
॥కార్మికులం॥

చరణం :
అందమైన భవనాలు నిర్మించినా
నిలువ నీడలేని అభాగ్యులం
పసిడి పంటలు పండించినా
కడుపునిండని అన్నదాతలం
॥కార్మికులం॥



–పులి జమున
8500169682.

## శ్రమ

సీ.
భూమిలోపలకింకి బువ్వగా మొలకెత్తు
కొలిమినందు రగిలి కొడవలౌను
దారమందున చేరి భూరివస్త్రమ్మౌను
కుమ్మరింట తిరిగి కుండయౌను
కత్తితో స్నేహించి క్షవరమై తా రాలు
ఉతుకుబట్టలందునూపిరౌను
పశువు చర్మమొలచి పాదరక్షగ మారు
స్వర్ణవర్ణములకు స్వరమెయౌను.
ఆ.వె.
రంపమౌనుతానె గంపయై నెత్తెక్కు
గొడ్డలౌనుతానె గడ్డపార
జగతినడకయందు
ప్రగతి యై వెలుగొందు
చెమటచుక్కనిపుడె చేరికొలుతు!



–డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

## శ్రమ జీవీ!వందనం!

ప్రతి నిత్యం కలలను
రెప్పల వాకిట్లో ఆరేసి
కన్నీటి గాథల్లో తడిచి పోతూనే
బతుకు క్షేత్రంలో
రేపటి ఆశల విత్తులను
నాటుకునే కార్మికుడా!.

చీకటి వెలుగుల కలనేతలో
బాధల పడుగు పేకల నడుమ
కరిగిపోతున్న కాలాన్ని
ఆశల పోగులతో అతుక్కుని
మగ్గం గుంటలో తపస్సు చేస్తూ
వేదనల కండెలతో
వెలుగు వస్త్రాలను వడకే కష్టజీవీ!

మరిగిన స్వేద నదుల్లో
కరిగిన ఆనందాలను నెమరేసుకుంటూ
విరిగిన కోరికల నాగళ్ళతో
బతుకు పొలాన్ని పండించేందుకు
అరిగిన రెక్కలను కుట్టుకుని
అహరహం పైరు బిడ్డలను
కాపాడుకుంటూనే
ప్రకృతిలోని అందాలను
కళ్ళకు కట్టించే
పర్యావరణ పరిరక్షణ వారధీ!

కాలానికి ఎదురీదుతూ
కష్టాల బరువులెత్తుకుని
కండల కొండలను కరిగించి
మౌన నదిలా సాగిపోతూ
సమాజాన్ని సుఖ జీవన సౌధంలో
కూర్చుండ బెట్టే శ్రామికుడా!

అలుపెరుగక తిరిగే
గడియారం ముల్లువై
అహర్నిశలు సేవల్లో నిమగ్నమయ్యే
మానవీయ హృదయుడా!

సమస్త లోకాన్ని భుజాలపై వేసుకుని
సకల మానవాళిని సంతోషింప జేసే
కర్మ శీలుడా!
నిజ జీవన సౌందర్యానికి
నీవే కదా నిర్వచనానివి!
ప్రగతి రథానికి నీవే కదా
ఇరుసూ చక్రానివీ!

మా జీవితాన
బతుకూ మెతుకూ నీవే
ఓ కార్మిక కర్షక ప్రతినిధీ!
శ్రమ జీవీ! నీకు వందనం!



–పురిమళ్ల సునంద,
9441815722

## శ్రమ యేవ జయతే

ఈ కం ప్యూటర్ వస్తు యుగంలో సైతం
కొనసాగుతుంది నిరంతరాయంగా శ్రమ దోపి డి
నవవసంతం కోసం వెతికే కార్మిక దేహాల్లో గ్రీష్మ
తాపాలే పాపం కొలువుతీర్తున్నాయ్ !!
నిత్యం శ్రమ ప్రవహించే కార్మిక సూర్య రస్మిలో
కనిపించే అవినీల లోహిత కిరణాలెన్నెన్నో ??
చ ట్టా లు చుట్టూ వున్న చట్టు బండలు
వ్యాపించిన యంత్ర తంత్ర నియామకాలు
కార్మికుల స్థానంలో రోబోల స్థావరాలు
అసలైన శత్రువులు యంత్రాలు రోబోలు కారు
పెట్టుబడి దారుని నెత్తి కెత్తుకునే ప్రభుత్వాలు
కార్మికుని జన్మహక్కు సమ్మె!అది ఓ నిషిద్ధపదం!
పనిగ నీటలు పెంచడం
వుద్యోగ భద్రతలు తెగ్గొట్టడం
వేతన కోతలుతో నామమాత్రపు వేతనతో
బతుకంతా నెట్టి వేసే కాంట్రాక్ట్ వుద్యోగసూత్రమ్
నష్టాలబూచిని చూపి అప్పుల కష్టాల్లో వున్న
ప్రభుత్వం కార్పొరేట్ బీదలకు రాయితీలిచ్చి
సంస్థలు ప్రయివే టీ కరించడం లేదా
లాక్ అవుట్ చేయించ డ నీ అలా అలా
శ్రమ యేవ జయతే ఆత్మ దుర్భర భారత్
కు టీ ర పరిశ్రమల మూసే మే కిన్ ఇండియా
గ్రామీణం విస్మరించి స్మార్ట్ నగరాలు
అన్నీ మైగ్రేషన్ ఆలోచనా రీతులు !!
స్రుజించే సంజీవన చేతల కోసం వె తికే
కార్మికులు సంస్థలలో భాగస్వామ్యం
ఎప్పటికీ యెన్నటికీ ఓ నెరవేరని పగటి కలే !!
అరచేతి చిటికెతో కర్మాగారాలన్నీ ఆక్రమించు
మహా మాయగా ళ్ల కార్పొరేట్ల ముందు
ఉద్యమాల ఊపిరి కార్మిక పిడికిళ్ల లో
నలుగుతూనే వుంది !!



–ఎల్. రాజా గణేష్
9247483700.

## నిత్య శ్రామికులు

ప్రకృతి వైపరీత్యాల్లోను
మట్టే బతుకు,మట్టే మెతుకని
మరబొమ్మలై అలుపెరుగని
సేద్యం చేసే కర్షకవీరులు.

కోడికూతతో మేల్కొని
నవనవలాడే కూరగాయలు
ఆకుకూరలు సంతజేర్చి
అమ్మే చిరువ్యాపారులు.

మురికి కాలువలు
రహదారులు,విపణి వీధులు
చెత్తాచెదారం శుభ్రపరిచే
పారిశుద్ధ్యకార్మికులు.

ఆసుపత్రి సిబ్బంది చేసే
అత్యవసర ఉచితసేవలు
రోగులకి ప్రాణదానమొసగే
వైద్యనారాయణులు.

మండుటెండలో
మలమలమాడుతూ
శ్రమదోపిడీకి గురయ్యే
ఇటుకబట్టీ శ్రామికులు.

సమాజంలో నిత్య శ్రామికులు
ఎందరో వారికి ప్రణామాలు
శ్రామికులకు చేయూతనిచ్చే
మహనీయులు ఆదర్శమూర్తులు



–యేముల/సిరిపురం వాణిశ్రీ
9392023988

## శ్రమతో నాస్తి దుర్భిక్షం.

శ్రామికుడంటే ఎవరు?
తను చద్ది అన్నం మాత్రమే తిని
తన కుటుంబానికి వేడి వేడి
బువ్వ తో కడుపు నింపాలని
శ్రమ మడుగులో ఈదుతున్నవాడు–

శ్రామికుడంటే ఎవరు?
యజమాని కళ్ల ముందు
కాళ్ల ముందు సలాం అంటూ
గులామ్ అవుతూ తనను తాను
కీలుబొమ్మ గా మలచుకొని
తను సర్వ ఇంద్రి యాలని పనిముట్లు గా
మోకరింప జేసిన వాడు–

శ్రామికుడంటే ఎవరు?
సూర్యుడి కన్నా ముందే నిద్ర లేచి
సూర్యుడు అస్తమించిన తర్వాతే
ఏ అర్ధరాత్రో నిద్రమ్మ ఒడిలోకి
జారిపోయిన వాడు–



–వి.సూర్యారావు
924 691 1234

## విప్లవాగ్నికి సలాం

పగలనక,రేయనక
ఎండనక,వాననక
దప్పనక,నొప్పనక
నకనకలాడే
చప్పిడి డొక్కకు
గంజి కోసం
గింజకోసం
కూడుకోసం
గుడ్డకోసం
కొలిమి కాష్టంలో
కండలను కరిగించి
చెమటలతో చెలిమి చేసి
పొగగొట్టాలతో
పొడిబారిన కళ్ళకు
కన్నీటిమట్టాల తడినింపి
అలసిపోతున్న అంగాలకు
సత్తువరెక్కలు తొడుగుతూ
రోజుకు పద్దెనిమిది గంటలు
కదలలేక కదులుతున్న
కాయకష్టానికి ఖంగుమన్న
గడియారపు జాలిగుండె
కాగడాగా మారింది..
పిడికిలెత్తి నిలిచింది..
పనిగంటల పరిధికై
తిరుగుబాటు చేసింది...

లేచిన పొద్దులేదు
కుంగిన పొద్దులేదు
పుట్టింది మొదలు
పుటం పెట్టే వరకూ
మున్నూట అరవైరోజులూ
ఒకటే ఋతువు
శ్వాస వీడేవరకూ
ఆగని శ్రామిక క్రతువు
బందిఖానాలో
భాగమౌతున్న
బానిస బతుకుల సంకెళ్ళపై
కాలం కన్నీరుకార్చింది..
ఆక్రోశపు ఆక్సిజన్ నింపి
వెట్టిచాకిరీ విధానంపై
వేలెత్తి చూపింది...

బాధ్యతల భారంమోస్తూ
బండెడు చాకిరీ చేస్తూ
మరుగుతున్న నెత్తురునే
దేహతరువుకు
ఎరువుగాచేసి
ఆకలి మంటల కేకలను
కొళాయి నీళ్ళతో మాపి
బతుకుతిత్తులకు
రేపటి ఆశలగాలి నింపి
శ్రమశక్తిని తాకట్టుపెట్టి
తగిన ఫలమడిగితే
కష్టాన్ని అపహాస్యం చేసిన
కరెన్సీల అహంకారం చూసి
స్వేదాశ్రువు ఎరుపెక్కింది..
కష్టానికి తగిన వేతనం కోసం
సింహగర్జన చేసింది..
కాలరాస్తున్న హక్కులకై
కార్మిక లోకం
రక్తతర్పణం చేసింది...
చారిత్రాత్మక చైతన్యం
ఏకమై చేయిచేయి కలిపింది
విప్లవ నినాదమిచ్చింది..
కార్ల్ మార్క్స్ పూరించిన
సమరశంఖం ప్రతిధ్వనించింది..

తల్లడిల్లిన ప్రపంచం
శ్రమశక్తికి తలవొగ్గింది
పనిగంటల భారాన్ని తగ్గిస్తూ
బానిస సంకెళ్ళను తెంచుతూ
శ్రమకి తగ్గ వేతనమంటూ
తూరుపు కొండల మధ్య
అరుణపతాకం
ఆవిర్భవించింది..
ప్రపంచ శ్రామికులంతా
ఏకమై స్వతంత్రగీతం
ఆలపించారు
ఆ రోజు చెమటచుక్కలు
చరిత్రలో చెరగని
సిరాచుక్కలై నిలిచాయి

బానిసగా బతికిన
క్షణాలను రూపుమాపి
గడుపుతున్న జీవితాలకు
కొత్త వెలుగులు నింపుకొని
సంయుక్తంగా సాధించుకున్న
విప్లవాగ్నికి సలాము చేస్తున్నాం



–విశ్వైక
9550183143

## శ్రమ ఫలితం

విద్యార్థి చదువుల
శ్రమ ఫలితం
విజ్ఞాన శోభను వెలిగిస్తుంది.
శాస్త్ర నిపుణుల
పరిజ్ఞాన రంగంలోని
శ్రమ ఫలితం
అధునాతన
సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుంది.
ఉపాధ్యాయ వృత్తుల శ్రమ ఫలితమే
ఉన్నత సమాజాన్ని నిర్మిస్తుంది.
వ్యవస్థాపకుల వ్యవస్థాపన
శ్రమ ఫలితమే
నిరుద్యోగ సమస్యను నిర్మూలిస్తుంది.
కర్మాగారాలలో
కార్మికుల కర్షకుల శ్రమ ఫలితమే
ప్రపంచానికి అవసరమైన
వస్తు సేవలను అందిస్తుంది.
దేశ సరిహద్దులోని
సైనిక దళాల శ్రమ ఫలితమే
దేశంలోని
ప్రజల ప్రాణాలను కాపాడుతుంది.
వ్యవసాయ రంగంలోని
అన్నదాతల శ్రమ ఫలితమే
ప్రపంచ దేశాల ఆకలి తీరుస్తుంది.

**–పసుపుల వెంకటేశం,**
8374479905



## రూకలు

ఆ.వె.
కండరాలు కరుగ కష్టించిననుగాని
బుక్క చిక్కదాయె భుజములుడిగె
రుధిరమంత మరిగి రూకల కేడ్వగ
ఇచ్చువారు లేక చచ్చు చుండ్రి!.


**– జక్కని గంగాధర్,**
9076352347

## మేల్కొన్న కార్మికా

దగాలూ దోపిడీలూ జరిగేచోట
ఎదిరించడం, పోరాడడం మొదలు
అక్కడే
ప్రశ్నించే మనస్తత్వం
పురుడుపోసుకుంటుంది!!.
కర్మ చేసే వారు కార్మికులు
శ్రమ చేసే వారు శ్రామికులు
జానెడు పొట్టకోసం
నిరంతర యాతన
శ్రమను దోపిడీ చేసే
పెత్తందారీ తనం!!.
శ్రమకు తగ్గ ఫలితం లభించక
కష్టమొచ్చినా ఆదుకునే దిక్కులేక
భార్యాపిల్లలకు
కడుపునిండా తిండిపెట్టలేక
నిరంతరం బానిస బతుకులతో
విసిగి వేసారిన శ్రమ జీవి
ఒక్కసారి పడగ విప్పి కోరలు చాచింది
మరుగుతున్న రక్తం
ఘర్మజలం కొరకు ధర్మయుద్ధం
న్యాయ పోరాటం చేసి
సాధించిన ఘనత!!.
ప్రేమదినం అమ్మదినం
స్నేహదినం తద్దినం
ప్రతిదానికో దినం
శ్రమ దోపిడీని గుర్తించిన దినం
కార్మిక దినోత్సవం అదే మే డే!!.
కష్టజీవుల శ్రమను
పెట్టుబడిగా పెట్టి
కోట్లకు పడగలెత్తిన బడా చోరులు
కష్టాన్ని గుర్తించని అక్రమార్కులు
శ్రమకు తగ్గ ఫలితం దక్కని దీనజనులు
బాధతో తాగుడుకు బానిసై
బ్రతుకు పోరాటం చేసే
శ్రమ జీవులారా!
మత్తుమైకంలో మునగక
ఆరోగ్యమే మహాభాగ్యంగా
పిల్లాపాపలతో
తృప్తి గా జీవన యానం
కొనసాగించండి!!


**–డా. చీదెళ్ళ సీతాలక్ష్మి,**
9110347693

## దారిదీపాలు!

శ్రమయేవ జయతే!
కృషికి సాధన తోడైతే ఫలితం!
అందరిమెప్పు!.
ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా
శ్రమించని, ఒళ్లు వంచని బతుకు
కదలని బండ!
కండ కరిగించి నడ్డివంచి
శ్వాసబిగించి ధ్యాసపెట్టి చేస్తే
విజయపథం!
కృషితో నాస్తి దుర్భిక్షం!.
నెత్తిన బరువు ఆకలి కరకర
ఎగిసే డొక్కల నిట్టూర్పులు!
వర్షం వరద నీటి కొరతతో
అల్లాడే రైతులు!.
తట్ట పార పలుగుతో
ఉరుకులు పరుగుల శ్రామికులు
ఊపిరితీసే శ్వాసకోశ రోగాలతో
బొగ్గుగనుల కార్మికులు!.
ఇంటా బయటా పనితో
సతమతమయ్యే తల్లులు
కుటుంబసుఖ సంతోషాలకై
శ్రమించే నాన్నలు!
వీరందరి విలువ
తెలుసుకుంటే చాలు!
నేటి యువత నేర్వాలి
శ్రమజీవనం కైలాససమమనే
భావనతో ఎదగాలి!
శ్రమజీవులే దారిదీపాలు!
చిట్టిచీమ నేర్పే పాఠాలు!.

**–ఎ.రాజ్యశ్రీ,**
8985035283

## లేదు–రాదు

శ్రమకు తగ్గ ఫలితం లేదు
వెట్టి చాకిరీ ని అడ్డుకునే
నాయకులు లేరు
అధికారులూ కరువే.
చట్టం మాత్రం పేపర్ మీద
సమాన పనికి సమాన వేతనం
సుప్రీం వారి ఆర్డర్.
అందిన ఆదేశాలను అమలుచేసే
మనసున్న వారు లేరు.
చాలీచాలని జీతం
పిల్లల చదువుకు సరిపోదు
కుటుంబ పోషణకు బొటాబొటి
బోసి మేడతో భార్య
బోరుమని ఏడిచే పిల్లలు
శ్రమ తక్కువేమీ కాదు.
అధికారి ఆఫీసు పని
వారి ఇంటి పని
వంట పని
డ్రైవరుగా కారు పని
ఆదివారం వారితో
విహార యాత్ర
శ్రమ తక్కువేమీ లేదు.
శ్రమను గుర్తించి
శ్రమకు తగ్గ ఫలితం
ఇచ్చే నాథుడు లేడు.
ఏం బతుకు!
పొరుగు సేవలోని వారిదీ
ఓ బతుకేనా!
ఏలిన వారికీ
పొరుగు సేవ పదం
అంటే నచ్చదు
అక్కడ ఇక్కడ ఎక్కడ ఉన్నా
శ్రమకు తగ్గ ఫలితం లేదు
రాదు కూడా.


**–పరాంకుశం నారాయణ రావు,**
9908229221

## వెలుగు

శ్రమైక జీవులం
మమేకమై బతికేద్దాం
శ్రమ లేదనే బతుకేది
బిడ్డ జననం అమ్మకి శ్రమ
జన్మించినదాది బిడ్డకు శ్రమ.
కష్టం లేని జీవి లేదు
కష్టపడక జీవనం లేదు
యుగయుగాలుగా జగంలో
నలుగుడు పడే ఈ మంత్రం
ప్రతి ప్రాణికి ఆధారం.
కమ్మరి కొలిమిలో
కుమ్మరి సారెలో
జాలరి పగ్గంలో
సాలె మగ్గంలో
శ్రమ జీవిస్తుంది
శ్రామిక జీవనం
కవనం కాదు, కథనం
మానవుల సామూహిక శక్తి
నిజ శక్తి, ధన శక్తి– అదే శ్రమశక్తి
కష్టం లేక ఫలం లేదు
శ్రమ లేక సౌఖ్యం లేదు.
మగ్గం, పగ్గం, కొలిమి, సారె
ఉపకరణాలైతే
సహస్ర వృత్తుల
ప్రవృత్తుల గీతం పాడే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి
లేదేదీ సాధనలేక!
కష్టాల్లోనే ఇష్టం ఉంది
ఇష్టం లోనే శ్రమ ఉంది
శ్రమ పడితే ఫలితం ఉంది
కష్టసుఖాల్లో శ్రమే ఊపిరి
శ్రమేశక్తి, శ్రమే సర్వం,
ఇది జీవన రీతి !!!


**–కె.కె.తాయారు,**
9440460797

## ఆకలి రాక్షసికింకా బలౌతున్న అమాయకమే

రాతి గుహల జీవనాలు
రంగుల భవనాలకు మారాలన్నా
కంద మూలాలనుండి
వండి వార్చే వంటలవరకు.
పెరుగు చిలికిన వెన్నలా
రుధిరం స్వేదమైతేనే
కొలిమిలో కాల్చిన కడ్రులా
కండరాలు కరిగిస్తేనే
దూది ఏకిన పరుపులా
నరాలను మీటితేనే
ఐదు వేళ్ళు నోటికి అందిస్తాయి.
ఆకాశహర్మ్యాలు నిర్మించాలన్నా
అగాధాలనుండి ఖనిజాలకైనా
గాలి తరంగాలను పట్టుకోవాలన్నా
సంద్రాలనుండి సంపదలకైనా.
సర్వాంతర్యామిలా వ్యాపించింది
అన్ని సంపదలకు మూలం శ్రమ
వ్యక్తులకూ దేశాలకూ విశ్వానికీ
అయినా ఆకలిని
జయించలేకపోతుంది.
అంగబలం, అర్థబలం
విజ్ఞానం, రాజకీయం
కలిసికట్టుగానో
విడివిడిగానో
స్థాయి ప్రకారం పోరాడుతూ
శ్రమపై దాడి చేస్తూనే ఉన్నాయి
నాగమణిలాంటి శ్రమ రత్నరాసులను
కొల్లగొడుతూ పోగేసుకోవడంలో
పోటీలే


**– నగునూరి రాజన్న,**
8332963129

## పనిలో పరమాత్ముడు

శ్రమలోన పుట్టు సర్వంబు తానౌను యన్నారు వేమన
కృషితో నాస్తి దుర్భిక్షం అంటారు చాణక్యనీతి శాస్త్రాన
కవి కోకిల శ్రమలు లేకయె ఫలములు దుముక బోవన
యోపిన విధానమున కష్టపడు పిండికొలది రొట్టెయన
దువ్వూరి వారి కృషీవలుడులో తెలిపిరి విపులముగ కందూర్.
పక్షుల పరికించ మసక మబ్బులో మేల్కొనును
వాటి భాషలలో పలుకుతూ కిలకిలారావాలను
రెక్కలు విదిల్చి నీలి నింగిలోన పయనించును
ఆహారాన్వేషణలకు అహరహమున శ్రమించును
సోమరితనము నెరుగము పశు పక్షుల కథలనైనను కందూర్.
నాటిన విత్తు పృథ్వి చీల్చి మొలకెత్తుట సహజము
మొక్కలకు మొలిచిన మొగ్గ మారును పుష్పము
శ్రమలోన క్రమశిక్షణ దాగియున్నదనుట నిజము
ఆరోగ్యము ఆయువులు ఆశించకనే ఫలితము
కర్షక కార్మిక శ్రామికుల రుధిరము మారును స్వేదము కందూర్.
శ్రమలేని శరీరానికి బద్ధకమే మిత్రుడగను
బద్ధకమున్న మనిషి భవిష్యత్తు చీకటగును
శ్రమకు తగిన ఫలితం ప్రకృతి ధర్మమగును
విపరీత బుద్ధిగల యజమానుల స్వార్థమును
ఎదురించక తప్పదని శ్రామికుల ఐక్యతలవసరం కందూర్.


**–కందూర్ చంద్రప్రకాష్ గుప్తా,**
8008572446

## శ్రమ వేదం

శ్రమయే ధరిత్రి నిండా సౌందర్యం
శ్రమయే విశ్వ ప్రగతికి రథ చక్రం
ఆకలికి అన్నం
నీడకు భవనం
వేషధారణకు అంగవస్త్రం
అర్థానికి
శ్రమయే ఒసగిన బహుమానం.
అధికార భాష అర్థం మార్చింది
చట్టాల చుట్టరికం పాలమారింది.
ప్రభుతా! ఓ ప్రభుతా!!
పరిశ్రమల నిండా హక్కుల హననమా
పనిగంటలను కాటేసే పన్నాగమా.
సమయమన్నది
నియమాలతో రణమైనది
కార్మిక చట్టాలకే భద్రత లేకున్నది.
సామరస్యం
సామాజిక న్యాయం
కరిమింగిన వెలగపండు
ఒక్క త్రిదళమైనా ఇస్తే బాగుండు
ప్రైవేటు వేటుకు
సొమ్మసిల్లిన శ్రమ సౌధం
వేతన చట్టాల్లో వాడిన శ్రమ వేదం.
బడి బాటకు
ఆకలి గీసిన చిత్రానికి
ఆరోగ్య పరిరక్షణకు
అందని వేతన సవరణ చట్టాలు.
పెరుగుతున్న నిరుద్యోగిత
చేతుల్లో పట్టాలతో నిరాశలో యువత
బతుకు సమరంలో
నిత్యం అభిమన్యుడే కార్మికుడు
పారిశ్రామిక
ప్రపంచమొక పద్మవ్యూహం
అదిపుడు ప్రపంచీకరణలో
శ్రమదాహం
తీర్చని తరుణం.


**–ఏదెల్లి రాములు,**
9494800454

## శ్రమయే వజయతే

శ్రమను నమ్మినవాడికి
సదా విజయ పరంపరనే
శ్రమించకపోతే
జీవితమంతా సోమరితనమే
ప్రగతిశీల ప్రజాస్వామ్యమెప్పుడూ
శ్రమజీవుల వైపే
శ్రమదోపిడికి వ్యతిరేక పోరాటమే
కార్మిక సంఘాల ఉద్భవం
ప్రపంచ కార్మికుల ఏకీకరణం
శ్రమజీవులకు దక్కిన అగ్రాసనం
ప్రకృతి పరిమళించేది
శ్రమైకజీవన సౌందర్యంలోనే
పని విభజనలోనే పరమార్థం
తేనెటీగల సమూహ సందేశం
స్వయంపోషక స్వయంసేవక
సమున్నత జీవనవిధాన
ప్రతీక పిపీలికం.
క్రమశిక్షణకే పాఠంనేర్పే
పాటవం శ్రమశక్తి
శ్రమను మించిన
మనోధైర్యం,
నైతికత మరేమున్నాయ్
శ్రమను నమ్మినవారికి
తిరుగేముంది– విజయం తప్ప
అందుకే అంటారందరూ
శ్రమయే రక్షతి రక్షితః
శ్రమయేవజయతే
ధర్మం శ్రమ పక్షమే!.


**–లక్ష్మారెడ్డి పసుల,**
810696191

## అసలైన శ్రమ

కళ్ళు మూసుకోనీయని శ్రమ
బాధను తట్టుకోలేక
మూతబడే కళ్ళదో శ్రమ.
కష్టమెరుగని శరీరానికి
కొవ్వు కరిగేందుకు శ్రమ
ఖాళీ కడుపు నింపేందుకు కరిగే
కండరాలదో శ్రమ.
కూలీనాలీ చేసి కడుపున పుట్టినోళ్ళ
చదువుల కోసం శ్రమ
నేర్చిన విద్యకు
నిరుద్యోగుల వేటదో శ్రమ
ప్రకటన చూసి
పగలూ రాత్రి పస్తులతో
పుస్తకాలతో శ్రమ
లీకేజీ లొసుగులతో
మళ్ళీ పుస్తకాలతో కుస్తీ శ్రమ.
పదవుల వేటలో
పుక్కిటి పురాణాలు
పలికి నమ్మించేందుకు శ్రమ
పావు పరకను ఆశించి
ఐదేళ్ళు పడరాని పాట్లు పడేదో శ్రమ
రక్తాన్ని చెమటగా మార్చే శ్రమ
పదవీ రథచక్రాల కింద
నలిగిపోయే శ్రమ
మేధామథనంతో
భవిష్యత్తును మార్చేందుకు
మేధావులు పడే శ్రమ
దేశరక్షణకై సరిహద్దుల్లో ప్రాణాలనొడ్డే
నాసోదర సైనికులదే
అసలైన శ్రమ..


**– గుర్రాల వేంకటేశ్వర్లు,**
9490918014

## ఫిదా అవుదాం

చెమటపూల పరిమళం శ్రమజీవనం
శ్రమజీవికి ఆకాశమే గొడుగు
నేలతల్లే పూలపాన్పు
కష్టాల గంగను నెత్తిన ఎత్తుకొని
శ్రమను నమ్ముకుంటూ జీవనం
కాంక్రీట్ జంగల్లో జన్మించినోళ్లకు
శ్రమ విలువ తెలియజేద్దాం
శ్రమను నమ్ముకున్న వారికి లేదు భయం
శ్రమశక్తికి కొట్టాల్సిందే అందరం సెల్యూట్
కాలక్షేపానికి చేసేది కాదు శ్రమ
కడుపులు నింపుకోవడానికి పడే
కఠోర పరిశ్రమ
శ్రమజీవుల్ని గౌరవిద్దాం
ప్రేమిద్దాం.
శ్రమజీవి చిందించే ప్రతి చెమట చుక్క
సూర్యుడికి అర్పించే ప్రసాదం
శనీశ్వరునికైనా శ్రమజీవంటే హడల్
శ్రమకు అందరం ఫిదా అవుదాం
శ్రమతోనే సర్వం శోభితం
శ్రమజీవికి అండదండలు అందిద్దాం
శ్రమజీవి సర్వస్వతంత్రుడు
శ్రమలో నియ్యతి ఉంటే
జీవితంలో విజయాలు సొంతం
నెర్రెలు బారిన భూమి సైతం
శ్రమతో సస్యశామలం
పండగైనా పబ్బమైనా శ్రమలోనే ఆనందం
శ్రమజీవులకు లేవు సెలవులు
ఆకాశంలోని సూర్యుడే
నేలమీద శ్రమజీవి
ప్రతీ వృత్తికారుడూ శ్రమజీవే.


**–లోడె రాములు,**
7382804913

## కృషితో నాస్తి దుర్భిక్షం

కృషి ఉంటే మనుషులు
రుషులౌతారన్నారు
కష్టపడి సంపాదించిన ఆస్తి
కలకాలం నిలుస్తునీదని
యజమాని కష్టపడి సంపాదిస్తే
ఇంటిల్లిపాదీ ఇష్టపడి తింటారట
అది తరతరాలకు
తరగని ఆస్తి అవుతుందని
నికృష్టమైన సనీపదకు నిలకడలేదని
చెమటోడ్చి తెచ్చుకున్న గింజలు
పక్షులు కూడా ప్రీతితో తింటాయట
శ్రమలేకకూర్చుని
అవినీతితో లంచాలతో కూడబెట్టినీది
కుక్కలపాలే!.
శ్రమలు రెండు
మానసికం, శారీరికం
మేధావి వర్గానిది మానసిక శ్రమ
కార్మిక కర్షకులది శారీరికశ్రమ
వృత్తి పరంగా చేసేది పవిత్ర శ్రమ
ఇంట్లో ఇల్లాలి శ్రమే లేకుంటే
అనీదరం పస్తులే
ఎవరి శ్రమ వారిది
కొలవటానికి కొలబద్దలేనిది
ఒక్కోసారి మన శ్రమ గంగ పాలు
సంపాదన దొంగల పాలు
కర్మ సిద్ధాంతం పనిచేస్తుంది
పూర్వ జన్మ సుకృతాన్ని బట్టి
ప్రాప్తమున్ననీత ఆస్తి మిగులుతునీది
ఎనీత వంకరగా పెట్టిలాగినా
వేలికంటుకున్నదే మన తేనె
శ్రమలేకుండా కూచునీడి తింటే
గుట్టలు కూడా కరుగుతాయి
శ్రమతోనే
ఆరోగ్యమూ గౌరవమూ ఐశ్వర్యమూ శాంతీ
పొట్ట కోసం చిట్టిచీమ శ్రమ
అనన్యసామాన్యం
అందరికీ ఆదర్శం
అందుకే కృషితో నాస్తి దుర్భిక్షం.




**– కందుకూరి మనోహర్,**
9908231588

## శ్రమే గౌరవం

శ్రమ లేనిదే పరిశ్రమ లేదు
పరిశ్రమ లేనిదే మనుగడ లేదు
మనుగడ లేనిదే పురోగతి లేదు.
ప్రతి ప్రాణిదీ శ్రమ జీవితమే
శ్రమించనిదే కుక్షి నిండదు
కుక్షి నిండ నిదే
ముందుకు సాగని జీవితం
పశు పక్షాదుల శ్రమ
జీవన మనుగడకే
మనిషి శ్రమ
తర తరాల మనుగడకి
భూలోక సౌఖ్యాలు
అనుభవించి తరించటానికి
అవి సాధించటానికి
శారీరక శ్రమ
మానసిక శ్రమ
రెండూ కలిస్తేనే
కొత్త ఆవిష్కరణలు.
కుటుంబంలో అందరూ
శ్రమ జీవులే
అమ్మ నిరంతర శ్రమజీవి
నిత్య శ్రామికురాలు
నిర్దిష్ట పని గంటలులేని
సెలవుల ప్రస్తావన లేకుండా
పనిచేసే పారిశ్రామిక వేత్త
తనే యజమాని
తనే కార్మికురాలు.
ఆమె సౌకర్యాల కోసం
అలజడి చేస్తే
ఆలకించేదెవ్వరు
అందుకే ఎవరితో చెప్పుకోదు
మౌనమే ఆమె భాష
నిర్దాక్షిణ్యం గా పిల్లలు
నిర్లక్ష్యం చేసినా
తన శ్రమమీదే
సడలని నమ్మకం
శ్రమ తోడుంటే
సాధించ లేనిది లేదు
శ్రమే ఆయుధంగా
ఆశల తీరం చేరుకోవచ్చు.


**–మోటూరి శాంతకుమారి,**
8106790978

## శ్రమైక జీవనం

ప్రాణము లోన పుట్టు
సర్వము తానౌను
విశ్వదాభిరామ వినురవేమ
వేమన వచనం అక్షర సత్యం
నేటి నాగరిక నరుని ఉనికి సర్వం
అవిశ్రాంత శ్రమైక జీవన ఫలితం.
మానవుడావిష్కరించిన సర్వ సౌకర్యం
మానవుడనుభవిస్తున్న ప్రతి వైభోగం
విజ్ఞానం, సంప్రదాయం, సంస్కారం
మొత్తం శ్రమ సాధించిన ఘన విజయం.
కష్ట పడి చిందిస్తే స్వేదం
రుధిరం దాలిస్తే చెమట రూపం
ఒళ్ళు దాచక పని చేస్తే నిత్యం
సకలం పాదాక్రాంతం.
శ్రమ తోనే పరిశ్రమలకు ఊతం
పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యం
కొండను పిండిగ చేసే హస్తం
జలధి లంఘించిన పాదం
గంగను ఇలకు దింపిన యత్నం
గిరిని చిటికెన వేలుతో మోసిన కరం
తెలుపలేదా శ్రమకున్న ఫలితం.
శ్రామికుల అవిరామ రెక్కల కష్టం
అవనికందిస్తున్నది సౌఖ్యాల సౌధం
శ్రమ దోపిడీకి చెల్లి పోయింది కాలం
శ్రమ జీవికి లేదెపుడు భుక్తి లోపం
శ్రమ జీవికి లోకమంతా లక్ష్మి నివాసం.
పిండి కొద్దీ రొట్టె అన్ని చందం
శ్రమ కొద్దీ లభించు శ్రీ కటాక్షం
శ్రమ లోకాన్ని నడిపించు చక్రం.


**–జె.వి.కుమార్ చేపూరి,**
96407 12062

## త్యాగఫలం

శ్రమశక్తి విలువ కొరకు
కార్మికులు ఐక్యతతో
ఆయువును లెక్కచేయక
అందుకున్న విజయంతో
అందరికీ ఆదర్శం
మానవాళికి అంకితం.
నిర్ణీత పనిగంటలే
ఉద్యమానికి ఊపిరి
కార్మిక వర్గం కలిసి
చైతన్యంతో మే డే సంబరాలు
జీవితాలకు వెలుగుల కిరణాలు.
ప్రపంచానికంతటికి
కొత్త వెలుగు
ఉరికొయ్యలెక్కిన
శిరస్సుల ఫలితమే
మే ఒకటి పండగ కాదు
శ్రమజీవుల పవిత్ర దీక్షాదినం.
పోరాటాలూ నిరసనలూ
ప్రదర్శనలతో సాధించిన విజయం
రేయింబవళ్ల కష్టం పోయి
ఎనిమిది గంటల పని.
ఐ.టి. రంగంలో
నేటికీ శ్రమదోపిడి
ఎన్నడు మారుతుందో
మేధకు నిలువు దోపిడి
అయ్యయ్యో!
అవకాశవాదుల
ఆగడాలెన్నటికీ ఆగవు.
శ్రామికులకు హక్కుగా
త్యాగఫలమొచ్చింది
దేశాలెన్నో నడిచాయి
అదే బాట తమ మాటగా
మానవాళికిది సంతోషం
శ్రమజీవులకెంతో ఆనందం.


**– శ్రీలతరమేశ్ గోస్కుల,**
7013943368

## శ్రమయేవ జయతే

పరమాత్ముని ఆనతితో
పుడమితల్లి ఒడిలో
మాతృగర్భాన జన్మించిన
మనమంతా శ్రామికులమే
మలమూత్రాదులను తుడిచి
పసిడి బొమ్మలా తయారు చేసి
రక్తాన్ని పాలుగా మార్చి
ఆకలి తీర్చిన మాతృమూర్తి
నీ ఉన్నతికై అహర్నిశలు కష్టపడిన
నీ జన్మకు కారకుడైన పితృదేవుల
శ్రమ వర్ణింపతరమా.
ఎండనక, వాననక
హలం పట్టి
పొలం దున్నే రైతన్న
ప్రాణాలకు తెగించి
దేశ రక్షణ చేస్తున్న సైనికుడు
విషవాయువులను సైతం భరించి
కర్మాగారాలలో పనిచేసే కార్మికులు
వ్యవసాయ పనిముట్లు చేసే కమ్మరి
కుండలు చేసే కుమ్మరి
నేడు సాంకేతికత,
శాస్త్ర పరిజ్ఞానాన్ని జోడించి
రోదసిలోకి
ఉపగ్రహాలను పంపే శాస్త్రజ్ఞులు
సముద్రగర్భంలో
నిక్షేపాలను కనుగొన్న పరిశోధకులు
ఎన్నని చెప్పను ఏమని చెప్పను
మహాకవి శ్రీ శ్రీ చెప్పినట్లు
ఆడుతు పాడుతు పనిచేస్తుంటే
అలుపు సొలుపు ఉండదు
శ్రమిస్తే తప్పక విజయం
నీ పరమవుతుందన్న
పేపర్ బాయ్ నుంచి
దేశాధ్యక్షుడైన భారతరత్న
క్షిపణి నిపుణులు అబ్దుల్ కలామ్
అడుగు జాడల్లో పయనించి
శ్రమయేవ జయతే అన్న సూక్తికి
ప్రతీకగా నిలుద్దాం.....!!.


**–అయ్యల సోమయాజుల ప్రసాద్,**
9963265762

## శ్రమజీవి

సూర్యోదయముతోనే
ప్రారంభం
నిత్యం నడిచే దారిలో
సఫాయి లు చేసే శుభ్రతకు
సాదర సత్కారం.
మనమందరం వారి శ్రమతో
పొందుతున్నాం ఆరోగ్యం.
ప్రతి కంపెనీకి
శ్రమజీవులు అవసరం.
ప్రతి శ్రమజీవి పని చేస్తేనే
సిటీలో బతుకులకూ ఆనందం
ప్రతి వ్యక్తికి పల్లెలో బరువు
పట్టణాలలో బతుకుతెరువు
కర్షకులు కార్మికులు
నిరంతర శ్రామికులు.
సింగరేణి కార్మికులు
తెలంగాణ కే సిరిసంపదలు
ధూమ శకట కార్మికులు
బాటసారులకోసం
అవతరించిన కూలీలు.
ఆసుపత్రిలోని ఆయమ్మలు
ఎప్పుడూ ఏమవుతుందో
తెలియని అయోమయ స్థితులు.
గుడిలో బడిలో కూలీలు
వచ్చిపోయే వారిని చూసి
మురిపించే ముత్యాల మాటలు
ఎదురు చూసే వారి చేతులు
ప్రతి వ్యక్తి జీవిత సత్యం
శ్రమ లేనిది లేదు ఫలితం.


**–రజని కులకర్ణి,**
9296450010

## మరో బ్రహ్మ

నింగిలో విధాత ఒకరైతే
అవనిపైని మరో బ్రహ్మను నేను
మట్టిని ముద్దాడే కుమ్మరి నేను
ముంత నుండి పొంత వరకు
పాలబుడ్డి నుండి పెద్ద గాబు వరకు
నైపుణ్యం ఒలికించే నేర్పరి నేను
బురద కొలను నుంచి
బోనాలను కలువల్లా సృష్టిస్తాను
తిండిగింజలకు
భాండాగారాలను సృష్టించగలను
ప్రతి అన్నపు పాత్రకు సూత్రధారిని నేనే
పాత్రల దొంతరల పరిమళాలకు
పరవశాల కాసారంలో కలువనవుతుంటా
నేడు కాలం వక్రించి
మా వస్తువులు కొనే దిక్కులేరు
చేసుకున్న సంపదంతా
శకలాలై పోతోంది
దినదిన గండంగా జీవనం మారింది
పాలకులారా!ప్రజాప్రతినిధులారా!
జనంలోని మానవతా హృదయులారా!
కుండలు చేసుకునే ఈ బ్రహ్మలను
కరుణామృత హృదయంతో చూడండి!
అక్కున చేర్చుకొని ఆసరా ఇవ్వండి!
మా ప్రాణాలను కాపాడి
పరమాత్ములు కండి!!.


**– వై. మంజులత,**
9396983346

## సమరయోధులు–సైనికులు

త్యాగ వేద పుణ్య కర్మ
ఆధ్యాత్మిక శ్రమైక
ప్రకృతి సంపద కలిగిన
మన భారత భూమి.
అగ్ర స్వాతంత్ర్య సమర యోధులు
శ్రమతో దేశస్వాతంత్ర్యానికి
కీలక ఆద్యులు.
ప్రాణాలను, శ్రమను
త్యాగం చేసిన వీరులు.
శ్లాఘనీయం గణనీయం
స్వాతంత్ర ఆర్జనకి
శాంతి శ్రమ అనే ఆయుధాలతో
పోరాడిన తీరు.
ప్రశంసనీయం
శక్తియుక్తులను ధారపోసిన వైనం
రాణిద్దాం అందరం
సమర యోధుల ఆశలకు ప్రతీకలుగా
కఠోర శ్రమ, నిష్ఠ, క్రమశిక్షణతో
విధి నిర్వహించే సైనికుడా
దేశం కొరకు ప్రాణాన్ని
తృణ ప్రాయంగా అర్పించే ధీరుడా
ఎముకలు కొరికే చలిలో సైతం దేశం
కొరకు
పహారా కాసే అంకితమైన శూరుడా
భరతమాత ముద్దుబిడ్డడా
నీకు వందనాలు సైనికుడా
నీ సాహసం, కఠోర శ్రమ
హిమాలయమంత
నీవే మాకు అండ దండ
నీ తపన, శ్రమే పెట్టుబడి
రాత్రంతా జాగరణ
జాతీయ జండాకే గర్వకారణం
రెప్పపాటు అవిశ్రాంతంగా
చురుగ్గా ఉంటూ
వీరోచిత పోరాటానికి ఎపుడైనా సై
దేశరక్షణకు ఎనలేని త్యాగంచేసే ఏకైక వీరుడు
ధీరోదాత్తుడు
మన సైనికుడు.
దేశ భక్తి నరనరాన జీర్ణించుకుని
రక్షణ కొరకు విధిని నిర్వహించే నిన్ను
ఒక క్షణం తలచుకుంటే
నీ విధి అసమానం అజరామరం.
కన్న తల్లిదండ్రులను
భార్యను ఊరిని సౌఖ్యాలను వదిలి
ప్రత్యర్థులపై గురి పెట్టి
దేశమాతను రక్షణలో
నీ జీవితం చరితార్థం.
నీ కర్తవ్య పారాయణ
తలచుకుంటే
రోమాలు చెవులు నిక్కబొడుస్తాయి
గుండె జలదరిస్తుంది
శ్రమను తలచుకుంటే
రక్తం సలసల కాగుతుంది.
ఓ సైనికుడా నీవొక వైతాళికునివి
నీ రెక్కల కష్టానికి
లెక్కలే లేవు
నీవొక యోధుడివి
దేశ ప్రేమ పిపాసివి.
అమర సైనికుల లక్ష్యాలను
అప్రతిహతంగా కొనసాగిద్దాం
శ్రమతో తెచ్చిన
స్వాతంత్ర్యాన్ని రక్షిద్దాం
మడమ తిప్పని ప్రతిమ పూనుదాం
భావి తరానికి స్ఫూర్తి ప్రదాతలుగా సాగిపోదాం
స్వాతంత్ర ఫలాలకు సాఫల్యత చేకూర్చుదాం
శ్రమతో ప్రతి ఒక్కరం
దేశాభివృద్ధికి పాటుపడుదాం.




**–ఆర్.ప్రవీణ్,**
9014124221

## విస్మరించకు

కాసు కోసం కష్టించే
ఓ కార్మికా
నీ కష్టాలు
తీరే వేళ వచ్చింది.
బుక్కెడు బువ్వకోసం
నీ శరీరాన్నే
తాకట్టు పెట్టినావు.
బడా బాబుల కింద
బానిసవై
బతుకుతూ ఉన్నావు.
అందుకే
ఓ కార్మికా
పాంథుడవై పయనించకు
ప్రగతి మార్గం విస్మరించకు .


**–సుతారపు వెంకట నారాయణ,**
984895869

## ఏదో ఒక పని

అన్ని వృత్తుల శ్రమజీవులు
బాధ్యత లెరిగినవాళ్లు
శారీరకమైనా
మానసికమైనా
విరామం లేని శ్రమ ప్రమాదం
మనిషిని కృంగదీస్తుంది
మనసును కృశింపజేస్తుంది
ఇష్టంతో చేసే పనికి కష్టం తెలువదు
కష్టంతో చేసే పనికి నష్టం ఉండదు
దారి చూపేది ఒకటైతే
దాని వెంట నడిచేది మరొకటి
రెండింటి గమనం వేరైనా
గమ్యం ఒకటే
జీవించడమంటేనే
ఏదో ఒక పని చేయాలి
శ్రమించకుండా సాధించి
కీర్తి శిఖరాలను
అధిరోహించిన వారు చరిత్రలో లేరు.


**–అర్రాడి దివాకర్ రావు,**
9391372407

## శ్రమదేవో భవ!

చెమటచుక్కల తడి
నుదుటి నుండి కారుతుంటే
అలసటెరుగని కర్తవ్యం
అలవోకగా పనిచేస్తుంటే
అంబరాన సూర్యుడు అస్తమించేదాక
కలిసికట్టుగా నడిచేది శ్రమ
సౌందర్య సాహచర్యాలు
పెనవేసుకొనే ఆత్మవిశ్వాసం
ఒళ్ళు దాచుకోని నిర్మలత్వం
ఒదిగి ఉండే వ్యక్తిత్వం
ఎంతటి పనైనా చేసే నైపుణ్యం
సౌధాలను నిలిపి
కట్టడాలను కట్టి
నిర్మాణాలను నెరిపే శ్రమ
దైవానికి సమీపం
జయ విజయ దీవెనలతో సాగే క్రతువు
ఖరీదు కట్టరాని
కడదాకా తోడుండే కాలచోదనశక్తి.


**–డా.రామక కృష్ణమూర్తి,**
9948285353

## వైతరణీ నది

ప్రకృతి మాత వారసులం
ప్రకృతికి మేమంటే ఇష్టం
ప్రకృతి అంటే మాకిష్టం
ప్రకృతిలో మమేకం
శ్రమే మా వారధి
మా జీవనోపాధి
మా జీవితం
మా ఆరోగ్య సంజీవని
మా జీవన్ముక్తికి సోపానం
మా జీవిత సాఫల్య ఆశాకిరణం.
మేం లేనిదే ఈ లోకం లేదు
ఒక్క క్షణం బెట్టు చేశామంటే
గుట్టలుగా పేరుకుపోయే చెత్త
అడ్డంలా
మెరిసే రోడ్లు, వీధులు
మా శ్రమ నిదర్శనాలు
ఫ్యాక్టరీలో మేం
పెండ్లిలో మేం
పుట్టుకలో మేం
చావులో మేం
ప్రపంచానికి బానిసలం
కూలిగాళ్ళం
పనిమనుషులం
గాయిదోళ్ళం
దేశ వెన్నెముకలైన
రైతులం సైనికులం మేమే
విశ్వాత్మనెరిగిన
మానస పుత్రులం
మేం లేనిదే ఈ లోకం లేదని
గ్రహిస్తే చాలు
మా జీవితం ధన్యం
మేం లేనిలోకం వైతరణీ నదే.


**–ఎం.వీరకుమారి,**
8374728321

## ఆ గీత చెరిగిన నాడే

యత్ర యాజమాన్యస్య
తత్ర కార్మికః ప్రత్యక్షః
అక్షరాల్లో వెంట్రుకవాసే తేడా
జీవితాల్లో పూర్తి తేడా
కష్టాలపాలు చేసే నైజం
కష్టపడే తత్వం
శ్రమనుదోచే వైనం
శ్రమైకజీవులమనే భావం.
కల్తీయైన ఆలోచనలు
కల్మషమెరుగని మనసులు
కక్షలు కార్పణ్యాలు చూపడం
కాయకష్టం పడటం
కడుపునిండా కాక్ టెయిల్స్
కల్లోగంజో తాగి గడిపేయడం
కఠినమనస్కులుగా ప్రవర్తించడం
కనికరానికే నోచుకోకపోవడం
కొండమీద కోతినైనా పొందగలగడం
కటికనేలపైనే నిద్రించడం
ఇలా
కాకమ్మ కథలతో
సామెతలు తిరగరాయడం
కష్టేఫలి లేక
కృంగి కృశించడం
ఈ దీనావస్థకి
ఫుల్ స్టాప్ పడిననాడే
కమ్మటి కార్మిక దినోత్సవం.


**– ఉండవిల్లి సుజాతా మూర్తి,**
93472 48428

## వాళ్లు నిర్మాతలు..!

వాళ్లు వొట్టి మనుషులు కాదు
మనసున్న గట్టి మనుషులు
కష్టాన్ని ఇష్టపడే ఉత్తములు
రెక్కల శ్రమను నమ్ముకుంటారు
సంద్రాన్నైనా ఎదురీద గలరు
కానీ శరీరాన్ని అమ్ముకోరు
మట్టి తల్లి ఒడిలో తిరుగాడుతూ
నిత్యం ఒడిదుడుకులు ఎదుర్కొంటారు
ఆకలి దప్పికలను అణచుకుంటూ
చెమట చుక్కలను ధారపోస్తారు
శ్రమ సౌందర్యానికి సమానం
లేనే లేదని నిరూపిస్తారు
శ్రమించే తత్వమే
జీవన సారమని ఎరుక జేస్తారు
రేయింబవళ్లు కష్టాన్ని ధారపోస్తూ
అందని ఫలాలతో ఆస్వాదిస్తారు
కన్నీళ్లతో మాట్లాడిస్తారు
చరిత్ర సహితం రాయగలమని
నిరూపిస్తారు
వాళ్లు మామూలు మనుషులు కాదు
రేపటి చరిత్రకు సజీవ సాక్ష్యాలు..!.


**– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,**
9441561655

## శ్రమతనం

పత్రం
ప్రపంచంలోనే
ప్రధాన కర్మాగారం!
ప్రభాకరుడు
ప్రధాన కార్మికుడు!!.

ఆ కార్మికుడు
ఉదయించక పోతే
లోకములో
ప్రజలకు
పదార్థమే లేదు!
ఆహార పదార్థము లేనే లేదు!!.

ఈ కార్మికుడు
శ్రమించకపోతే
లోకములో
పరిశ్రమలు లేవు!
పలు ఉత్పత్తులు లేనే లేవు!!.

శ్రమించడం అంటే
ఆశ్రయించడం కాదు
ఆక్రమించడం కానే కాదు
పరాక్రమించడం
ప్రకాశించడం
కాంతులు విరజిమ్మడం
లోకానికి వెలుగునివ్వడం!
సమిదగా మిగిలిపోవడం!!.

శ్రమ లోని
ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని
అందరూ
లోకంలో అందరూ
గ్రహించాలి!.

శ్రమ తనం లోని
మనిషితనాన్ని, మహాతనాన్ని
లోకంలో మనుషులందరూ
గుర్తించాలి!!



– అమ్మిన వెంకట
అమ్మిరాజు
94407 08656

## రత్న రాసులు ....

రుధిరం స్వేదమైతేనే
నోరు మధురమై... ఉదరం
నిండేది....
చీకటి వెలుగుల చక్రంలా
వింత నిరంతర ప్రక్రియ
సర్వాంతర్యామిలా వ్యాపించినది
అన్ని సంపదలకు మూలం శ్రమ
వ్యక్తులకైనా...దేశాలకైనా...విశ్వానికైనా
కానీ శ్రమ ఆకలిని జయించలేకపోతుంది.

ఒకప్పుడు అంగబలంతో
వంగబెట్టి లొంగదీసుకుని
దాస్య జీవితాలను దఖలు
పరిచారు...తరాల తరబడి.

ఆకలికి పేగులు కదిలి వంకర్లు పోతుంటే..
కూలి డబ్బుల్లో కూడ బలుక్కుని బేరం పెట్టి
కొన్నాళ్ళు... కష్టానికి తగిన ప్రతిఫలాలు
కార్మికులకు అందకుండా చూసారు.

మరోవైపు సంక్షేమ సంగతుల పేరుజెప్పి
ఉచితాల ఊసులతో పథకాలు త్రాసులు
ప్రవేశపెట్టి ... సోంబేరులకు వారసులను చేసి
పలుపుతాడుతో బంధించి పామరులను
చేస్తున్నారు.

కారణాలేమైనా కథాసారాంశమంతా
చివరాకరుకు చిత్రంగా ఒకటే సుమా ....
అంగబలం, అర్థబలం, విజ్ఞానం, రాజకీయం..
కలిసికట్టుగా కాకపోయినా....
స్థాయి ప్రకారంగా
పోరాడుతూ దాడి చేస్తూనే ఉన్నాయి
శ్రమ
రత్నరాసులను పోగేసుకోవడంలో



-నగునూరి రాజన్న
8332963129

## మేడే

భుక్తి కోసం మేడే
విముక్తి కోసం మేడే
మేడే మేడే,
చిత్తశుద్ధితో నిలిచారో
భావశుద్ధితో పిలిచారో
మేడే మీకు మార్గం
సంతోషాల స్వర్గం
ఒక సురుచిర లక్ష్యం మేడే
ఒక సుమధుర గమ్యం మేడే
మేడే మేడే,
పల్లకి మోసే బోయలు
కోనల కూసే కోయలు
జంకుతూ ఎన్నాళ్ళు
భయపడుతూ ఎన్నేళ్ళు
శ్వాసించే హక్కుని
నివసించే స్వేచ్ఛని దోచేదేవడే
మేడే మేడే .
ఒక పచ్చని శ్వాసకై
ఒక వెచ్చని ఆశకై
పరదాలన్నీ తీసేయ్
అడ్డుగోడలే కూల్చేయ్
మతాలన్నీ నెలవైతే
ముతాలన్నీ కొలువైతే
ఈ క్షణమే యుద్ధం కావాలి సిద్ధం
ఉదయం వుంది చూద్దాం
నవశకమే తెద్దాం .
కార్మికులంతా రండి
కర్షకులంతా రండి
మంత్రాల సర్పంచు
దుస్తంత్రాల పట్వారి
తంత్రాల పటేల్ కుతంత్రాల దొర
తొడకొట్టే మేడే పడకొట్టే మేడే
మొన్న నిన్న దోపిడీలో
నిన్న రేపు రాపిడిలో
కదిలే ఊరువాడే మేడే
ఉద్యమవీరుల సాక్షిగా
అమరవీరుల స్ఫూర్తిగా
భుక్తి కోసం మేడే
విముక్తి కోసం మేడే
విశ్రమ మెరుగని దీక్షలో
విరామమెరుగని పరీక్షలో
గాలాలన్నీ తెగిపోవా
వుండేళ్లన్నీ వుడిపోవా
కొత్తదృష్టిలో మేడే
ఖడ్గసృష్టిలో మేడే
చేసిన మార్పులు ఒప్పని
చెప్పిన తీర్పులు తప్పని
మరుగుజ్జులకు మరణమే
మరమనుజులకు శరణమే.



-కోటం చంద్రశేఖర్
9492043348

## మాటలే మెడలు

అన్నంపెట్టే రైతన్న
కడుపు నింపే తల్లి
నిత్యకార్మికులు
అలుపెరుగని శ్రామికులు!!.

వీధి వీధి వాడ వాడ అంతా నీదే
నీవు లేని జగమే లేదు
పవిత్ర మనసుతో
స్వచ్ఛత కోసం పరితపించే!!.

రేయనక పగలనక ఎండనక వాననక
పరిశ్రమమిస్తూ అద్దంలా మెరవాలని
ఆ అద్దంలో తన అందాన్ని చూసి
మెరిసే మురిసిపోయే తారలు

జగతికి వెలుగులు!!

మన మురికే మనకు కంపు
అందరి కంపు వారికి ఇంపు
మేనికి బంగారుపూతలా పూసుకుని
ఎగసిపడే దుమ్ము విభూతిగా అలుముకొని
పనే దైవంగా భావించే
జాతి నిర్మాతలు !!

అందరికి నీవే బరువు
చిల్లర ఆశించే పెద్దమనసు నీది
పైసా విదిలించని పేద మనసు మాది
మనిషిని మనిషిగా చూడని సంస్కృతి
బురదగుంటలో పద్మా
అయ్యో అనని జాతి మాది
చస్తే కూడా ప్రేమతో హత్తుకుంటుంది ఆకుపై
దానికున్న విశాలత్వం లేని
కుళ్లుకంపు కొట్టే మానవులు!.

ఒక్కపూట నీవు లేక వెలవెలబోయి
కళ తప్పి కాంతి లేక
రాకకోసం ఎదురుచూస్తున్న రోడ్లు
ఏరులై పారు మురుగు నీరు
నోళ్లు తెరచి చూచు మురికి రంధ్రాలు
మీకోసమే మేమంటూ ఆశగా
ఎదురుచూసే చెత్తకుప్పలు!!.

బ్రతుకే పోరాటం
బ్రతుకాలనే ఆరాటం
ఎదగాలనే ఉబలాటం
అందరిలా ఉండాలని దేవులాట!!.

మీ ఒడలు మరచి
మెడలు వంచి
శ్రమయే ఊపిరి చేసి
కత్తిపట్టి గొంతులు కోయక కేవలం
చీపురు ఆయుధంగా
చెత్తను తరిమేసే
మీకు ఏమివ్వను
నా మాటలే మెడలు మీకు
సోదరులారా
మేడే వందనాలు!!



-డా. చీదెళ్ల సీతాలక్ష్మి,
9490367383

## శ్రమ కేతనాన్ని

ఆవాసాల సావాసంతో
నిలువ నీడనందించే
సలువ పందిరిని.

ముంజలు, గేగులు, పండ్లని
పంచే కమ్మని తిను బండారాన్ని.

ఈదులు, కర్రలు, బొత్తలు
పండు, పరుపు, పొద్దాళ్ళు
అండ నిల్చిన తాటి బలగాన్ని.

కంచుడు, కుండ, పటువ
బుడ్డి, లొట్టి, శేర్లన్నీ
తరాల పొరల్లోకి జారుకుంటే
గ్లాసులు, సీసాలు, ప్లేట్లు
ప్లాస్టిక్ కవర్ల రొదతో
రాజీ తప్పని నడకని.

వస్తాదులా ముస్తాబు చేసే
మోకూ ముస్తాదులతో
పురుగు బూశిని ఉరికించే
గజ్జెల సవ్వడుల అభయంతో
నిడు మ్రానుల ఉడుమోలె పట్టి
ఉడుతోలె ఎగబాకి వస్తా.

ఒళ్ళంతా కాయలతో కమిలినా
నా నాలుక పిడచ కట్టినా
ఆకుల రేకల్లో ప్రవహించే
మానవీయ తృప్తి రసాన్ని.

ఏ కులమని ఎవరినడగని నా అడ్డాలో
ఆల్ల ఈల్ల సంగతులెన్నో కొలిక్కి వస్తున్నా
ఇహ పర చింతన పెంచే
సకల జనుల చెలిమిని.

ఈదురు గాలులకు నేల రాలని
ఈత వనంలా
తూఫాన్లకు తట్టుకొని నిలబడే
తాటి సైన్యంలా
ఆటు పోట్లెన్నెదురైనా
నమ్మకాన్ని వీడని గౌడన్నని.

ఆధునికతలో వీస్తున్న
ఆకలి సుడిగుండాలకు
వృత్తి విస్తరి ఎగరకుండా
ఎదురీదే గీత కార్మికుడిని.

బార్లు, బీర్ల ప్రవాహంలో
కల్లు సీసా బోర్లా పడకుండా
నన్ను నేనుగా నిల బెట్టుకునే
విశ్రమించని శ్రమ కేతనాన్ని.



-డాక్టర్ మండల
స్వామి
9177607603




అసలు శ్రమ అంటే మానసికంగా ఆలోచించి శారీరకంగా సాధించి నలుగురికీ ఉపయోగ పడేలా చేయటం!కృషి తో నాస్తి దుర్భిక్షం! పనిచేస్తేనే ఫలితం దక్కేది. గొంగళి పురుగు ప్యూపా దశలో ఉండి తనంతట తనే రెక్కలబలంతో బైటికి వస్తేనే సీతాకోకచిలుకగా మారుతుంది. ఏ కష్టం చేసినా

### మానసిక శ్రమతో కొత్త ప్రయోగాలు, పరిశోధనలతో మనిషి అంతరిక్షంలోకి వెళ్లేందుకు మార్గం సుగమమైంది

ప్రయోజనం ఉండాలి. మాటల వల్ల పని జరగదు. "శ్రమలు లేక ఫలాలు దుముకబోవు"అన్నారు శ్రీదువ్వూరి రామిరెడ్డిగారు. శ్రమజీవనం కైలాసం తో సమానం. శక్తి, యుక్తి, సహనం, చేయూత, ప్రోత్సాహం ఉంటే కొండనైనా పిండి చేయగలం. శ్రమ అన్నది సత్ఫలితాన్ని ఇచ్చేదిగా ఉండాలి. నల్గురికోసం ఒకడు నిస్వార్థంగా పనిచేస్తేనే అది సమాజానికి దేశానికి హితం! చిన్ని నా పొట్ట శ్రీరామరక్ష అనే స్వార్థం, కుత్సితత్వం ఉంటే తిరుగుబాటు తప్పదు. చిట్టిచీమలన్నీ కలిసి పెనుపామును చంపగలవు.

గుడ్డు నించి పిల్ల బైటికి వచ్చేప్పుడు పడే శ్రమ విదితం.కానీ ఆ కోడిపిల్ల చికెన్ గా మారి మనిషికి ఆహారం అవటం దారుణం!

నేటి కార్మిక కర్షకులు నిట్టనిలువుగా ప్రకృతి వైపరీత్యాలు స్వార్థ అవినీతి పరుల వల్ల దోపిడీకి గురై చెట్టుకి వేలాడటంలోనే తెలుస్తోంది– ఎలా మోసపోయి, దగాపడి, కుటుంబానికి కన్నీరు మిగిలిస్తున్నారన్న సంగతి!

మానసిక శ్రమతో కొత్త ప్రయోగాలు, పరిశోధనలతో మనిషి అంతరిక్షంలోకి వెళ్లేందుకు మార్గం సుగమమైంది. పాతరాతియుగం నుంచి నేటి దాకా శారీరకశ్రమతో నాగరికత విరిసింది. బండి చక్రం కనుగొనటం ఓ పెనుమార్పు. కూడు, గూడు, బట్టకై పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపింది. కానీ, తేనెటీగలు కష్టపడి సంపాదించిన మకరందాన్ని మనిషి కొల్లగొడుతున్నాడు. చీమలు పెట్టిన పుట్టలు పాములకిరువైనట్లు కొద్ది మంది స్వార్థపరులవల్ల అసంఘటిత శ్రామికులు, కార్మికులు, బాల కార్మికులు దోపిడీకి గురికావటం విచారకరం! చదువు సంధ్యలు, నీతినిజాయితీ ఉన్నవారు పేరాశ గల మాటలతో బురిడీ కొట్టించేవారి చేత వంచింపబడుతున్నారు. ప్రేంచంద్ కథల్లో ఆనాటి బడుగు జీవి గ్రామ పెద్దలవల్ల మోసపోతే నేడు అన్నీ తెలిసిన శ్రామిక కర్షక బడుగుల బతుకు అధ్వాన్నంగా మారటానికి కారణం ఎవరు?అందరికీ అన్నీ తెలుసు. చట్టాలు అమలు పర్చటంలో చిత్తశుద్ధి ఉండాలి. సొమ్ము ఒకడిది సోకు ఒకడిది కాకూడదంటే నేతలు, అధికారులు నీతినిజాయితీ పరులై ఉండాలి. ఇది లేని నాడు ఎన్ని కథలు కవితలు వ్యాసాలు రాసినా బూడిద లో పోసిన పన్నీరు సుమా!

–అచ్యుతుని రాజ్యశ్రీ,
9030364067

## స్వచ్ఛత చెక్కే శిల్పులు

కూసే కోయిలకు నాకు పెద్ద తేడా లేదు
కూత కూస్తూ మేత కోసం
పరుగెడుతోందది
పొట్టకూటి కోసం చీపురుకట్టతో
పరుగెత్తుతాను నేను
నా ఆయుధం చిన్నదే కావచ్చు
కానీ ఆగనిదీ యుద్ధం
కోయిల గుర్తింపు స్వరం
నా గుర్తింపు పనితనం
అందరూ ఇంట్లోనే తొంగున్నా ..
కుటుంబం పై మమకారం వెన్నంటినా ..
చెక్కుచెదరనిది నా సంకల్పం
బాధ్యత మరువనివ్వదది ఏ క్షణం
నేపూనుకుంటే నా ఆయుధంతో
అంటువ్యాధులన్నీ మటుమాయం
ఆ చీపిరి పోస్తుంది అందరికీ ఊపిరి
మూలమూలలా విస్తరిస్తూ
చెత్తనంతా సేకరిస్తూ
కుప్పలు కుప్పలుగా ఎత్తిపోస్తూ
ఇల్లు, గదులు, రోడ్లూ, వీధులూ ఊడుస్తూ
కలిసి కట్టుగా సాగే మేము ?
చీపురు పట్టిన సైనికులం
స్వచ్ఛతను వీధులకు అద్దుతాం
ప్రతి మూలమూలను పలకరిస్తాం
మాలిన్యాల కుప్పచేసి తొలగిస్తాం
మురికిని ముట్టుకున్నా
మైలపడని మనస్కులం
మా కష్టం గుర్తించకున్నా
మమ్ము అసహ్యించుకోకపోతే చాలు
ఎవరేమన్నా లెక్కచేయం
ఎందుకంటే మేం
స్వచ్ఛతను చీపురుతో చెక్కే శిల్పులం
తలవంచి పనిచేసే శ్రమజీవులం.



–డా . సమ్మెట
విజయ
9989820215

## శ్రామిక వర్గం

ఎర్రతుండు కట్టిన శ్రామికుల్లారా
ఎర్రజెండా పట్టిన కార్మికుల్లారా.

బరువెత్తుకున్న బండలతో
బరువెక్కుతున్న గుండెలతో.

కష్టం కార్చే కన్నీళ్లకు
కష్టం తీర్చని నాయకులు.

ఎదురొస్తారు ఎగిరొస్తారు
ఎన్నిక టైములో సర్కారు .

కాయా కష్టం మాయం
అధిక ధరలతో అన్యాయం
అడగరు కదగరు ఏ ఒక్కరు
గెలిచేదంతా దౌర్జన్యం.

జవానుడైనా కిసానుడైనా
కార్మిక వర్గం బాటే.

నీటి చుక్కతో సేద్యం
చెమట చుక్కతో నైవేద్యం.

ఇరువురి త్యాగం
రజకుల భోగం
పదవుల చాటున వైభోగం.

నెత్తి తట్టతో
చేత పొట్టతో
సాగెను లాగెను జీవనం !



–కనకరాజు గనిశెట్టి
9014602175

## కార్మిక దిన మహోత్సవం

కర్షక, శ్రామిక, కార్మిక లోకపు
వర్గ సముదాయానికి మహోత్సవం..
కార్మిక దినోత్సవ ఉత్సవంకు
నామకరణంగా ఇది మేడే దినోత్సవం.!

శ్రమ దోపిడికి
వ్యతిరేకం అంటూ
కార్మిక వర్గం గళం ఎత్తిన దినం..!

కర్షక,శ్రామిక, కార్మిక వర్గాలన్ని
మిలితమై ఉద్యమ బావుట
ఎగురవేసిన దినం..!

ఎందరో వీరుల ఆత్మ బలిదానం..
మరెందరో కార్మికుల రక్త తర్పణం..!

రోజుకు ఇరవై గంటల శ్రమ
దోపిడి మీద ఉద్యమించి
కేవలం ఎనిమిది గంటల పని
అనే హక్కులు సాధించిన దినం..!

పెట్టుబడిదారి వ్యవస్థకు
తిలోదకాలు అద్ది,
శ్రామిక లోకం అంతా ఏకమై
పిడికిలెత్తి గళం విప్పి,
బానిసత్వమును నిరసిస్తూ
గుండెల్లోకి తూటాలు దిగి
రక్తం ఏరులై పారినా
అసువులే బాసినా
ఉద్యమ బావుట ఎగురవేసి
ఉద్యమ స్ఫూర్తి రగిలించి
ఎర్ర జెండారెపరెపలాడించిన
ఈ అమరుల త్యాగధనులను స్మరిద్దాం.!
శ్రామికుడి చెమట చుక్కను గౌరవిస్తూ..
కార్మిక లోకానికి
శుభాకాంక్షలు తెలియజేద్దాం.!
ఇంక్విలాబ్ జిందాబాద్
అని ఎలుగెత్తి చాటుదాం.!!



–ఎన్. రాజేష్,
9849335757

## శ్రమ

శ్రమ లేని పరిశ్రమ లేదు
దోచుకోని పెట్టుబడిదారు అరుదు
శ్రమించేవాడు శ్రామికుడు
శ్రామికుడు ఉత్పత్తి కారకుడు!

శకాలనుండి ఈ కాలం వరకు
అవిశ్రాంత శ్రమ దోపిడి
అభాగ్యుడి శ్రమరాశి
భాగ్యుడి ధనరాశిగా!

శ్రామికుడి స్వేదం
పెట్టుబడిదారుల సంపదగా
కార్ఖానాలు కార్మికుడికి
జీవన కారాగారాలుగా!

డస్సిపోయిన యంత్రానికి
తరుగుదల నిధి
అలసిపోయిన శ్రామికుడికి
ఆధారం ఏది!

ఉదయించే సూర్యుడు కార్మికుడు
బడా బంగ్లాల్లో వెలుగులు
జాగరణ చేసే జాబిలి కార్మికుడు
ఉన్నవారికి వెన్నెల రాత్రులు!

ఉన్నోడి విందులు విలాసాలు
అభాగ్యుడి చమట చుక్కలు
సుందర కట్టడాలు
ఎన్నో కరిగిన కార్మికుల కండలు!

అంగట్లో అన్నింటి ధరలు
నిర్ణయించేది అమ్మేవాడు
తన విలువ ఏమిటో తెలియనివాడు
ఒక్కడే ఈ ఆర్థిక బక్కోడు!ఔ

తాను అలిగితే శక్తి ఆకాశమంత!
రావా అవకాశాలు
అవే వాటంత!!



–జగ్గయ్య.జి
9849525802

## చెమట పాదం

చెట్టు ఎంత శ్రమ పడితే
మారింది విత్తనంగా
విత్తనం చెట్టవడమంటే మాటలా
మధ్యలో ఎన్ని చెమట చినుకుల్ని
అలుముకుందది
ఎన్ని జీవితాల్ని వల్లె వేసింది
ఎన్ని బతుకులకు ఊతమిచ్చింది
దాన్ని నిలుపుతున్నది మట్టిలో వేర్లే
భూమి తలెత్తితే
ఆకాశం కనిపిస్తుందన్నంత నిజం అది.

ఎంత చెమట నది పారితే చెరువు తవ్వకం
ఎన్ని చినుకుల బంధం చెరువు
శ్రమ విలువ తెలిసిన చేనైంది
మట్టి, జీవుల దాహం,
మనిషి దాహం తీర్చింది
చెరువు నీరే భూమి నరాల్లో
ప్రవహించే రక్తం.

పొయ్యి ముందు గొట్టమూదడానికి
అట్ట ముక్కతో విసరడానికి
ఊపిరెంత ఖర్చు పెట్టిందో అమ్మ
కట్టెల పొయ్యో, చిట్టు పొయ్యో
కమ్మగా కడుపులు నింపింది
అమ్మ చేతి కష్టం మహాత్యం అది.

శ్రమ తీగ ఏ దాబా పైనో పాకదు
గుడిసెకే పరిమితం
పని అడ్డాల్లో ప్రదక్షిణాలు
ఆ చేతులు ఎన్ని మెలికలు తిరిగితే
భవనాలకు హంగులు.

నాడు మేడే అంటే శ్రమ గీతాల కొలువు
హక్కుల సాధనకు వేసే దరువు
ఇప్పుడది చచ్చిన కోడి పౌరుషం
కుమ్మాల్సిన ఎద్దు కూలబడ్డది
వీపుకు తగిలించుకున్న బ్యాడ్జి.

మేడే నేడు
ఒక ఊరేగింపు, పది నినాదాలు
రెండు పాటలు, నాలుగు ఉపన్యాసాలు
కలుసుకున్న చేతులు విడిపోయేదక్కడే.

కార్మికుల హక్కుల దినోత్సవం కల చెదిరింది
కార్పొరేట్ల కాళ్లు తుడిచే
డోర్ మ్యాట్ గా శ్రమ
తెలివి మీరిన ప్రభువులకు దయ పెరిగింది
పగలు, రాత్రి పని తొక్కలు నమలాల్సిందే
మేడే మాడేనా ఆశ్చర్యపోతున్నారు కార్మికులు



–కొమురవెల్లి
అంజయ్య
9848005676

## శ్రమదోపిడి

సాగుతోంది సాగుతోంది
శ్రమదోపిడి యధేచ్ఛగా
శ్రామికుని రుధిరమదియె
స్వేదాశ్రువులై యుబికివచ్చి
ధనవంతుల బోషాణమునే
కనకరాశులతో నింపగ
లేనివాడు ఉదరమందు
రేగుతున్న క్షుధాగ్నుల
చల్లార్చగ........

తలనువంచి శ్రమదోపిడి
కెరగమారె
ఎండనక వాననక
కండలు కరిగించు వాడు
కొండల కదిలించువాడు
భువిపై మేడలు నిలుపు
అంతర్జలాల పొంగించు.

కర్మచారి కర్మఫలమె
ఘర్మజలపు యేరులయ్యె
యేరులై సెలయేరులై పారుతున్నది
యెత్తుపల్లపు భేదమెంచక.

కబేళాలు వెలగట్టెడు కళేబరాల
విలువకన్న శ్రామికుని విలువజూడ
చవకయ్యెను సమాజమందు
ధనమదాంధులైన మనుజులందున
దానవత్వమె యావలించగ
మానవత్వమె మృగ్యమయ్యెను
శ్రమజీవిని సాటిమనిషిగ
కాంచలేని కాలమొచ్చెను.

వాడులేని నాడు
నీ మనుగడ ప్రశ్నార్థకం
నీకవసరమైన సమస్తం
కూడు గుడ్డ నీడ జాడ
వాడొసగెడు భిక్షగాదె
శ్రమశక్తియె లేనినాడు
అంధకారమీ లోకం. –విరించి

## జయహో శ్రమశక్తి

గుహల నుండి గగనం దాకా
నడిచి వచ్చిన నాగరికత
చరిత్ర ఆనవాళ్లన్నీ దాని చిహ్నాలే.

గుప్పెడు బియ్యం గింజల కోసం
సూర్యుడితో ప్రయాణం సాగిస్తుంది.
శరీరం ఓర్చుకుంటున్న గాయాల సలపరింత.

శ్రమ
మనకు జీవం పోస్తున్న వ్యవసాయం
సుఖ పెడుతున్న యంత్ర సేవ
భూగోళాన్ని నడుపుతున్న ఇంధనం.

తన కళలతో ఎదుటివారి కలల్ని పండిస్తుంది
లోకాన్ని పాప నవ్వులా వికసింప చేస్తుంది
చెమటైరాలి ప్రగతి చక్రం తిప్పే విద్యుత్.

నలుగురి బాగు కోసం
నడుముకు బిగించిన చీర కొంగు
ఎదుటి వారి ప్రగతి చూసి
తనను తాను మరిచేది

అది ఊపిరి తీసుకోలేనంత విరామం లేనిది.
దాని శక్తి అంచనాలకు అందనిది
దాని ఫలితం పర్వత శిఖరాలంతా ఎత్తు
దాని ప్రదర్శన చూసి ఆకలి వీగిపోతుంది
నమ్మిన వాళ్లకు భుక్తి భయం లేదు.

ప్రతి వాడి ప్రగతి తంత్రం
అభివృద్ధికి దారి చూపు దీపం
గనుల్లో దోపిడికి గురైన వజ్రం.

ఒకడు శ్రమను
పవిత్ర గంగాజలంలా ధారపోస్తాడు.
మరొకడు
పసిడికన్నా ప్రియంగా దోచుకుంటాడు.

శ్రమ ఇప్పుడు
ధనిక వర్గపు వలలో చిక్కిన చేప
శ్రమజీవులను
మనుషులుగా చూడడం తక్కువ జేసి
శ్రమ దోపిడీ చేసే సోమరులారా!
సర్వకాల సర్వావస్థల్లో నిజం ఒక్కటే
మీ అభివృద్ధికి మూలం శ్రమజీవులు

శ్రమ శాంతికపోతంలా ఉన్న విప్లవం
జయహో శ్రమ శక్తి
జయహో మే డే



–దామరకుంట శంకరయ్య
9440876788

## శ్రమయేవ జయతే

ఏదీ రాదు పడందే కష్టం
పైకి ఎదిగేందుకు తప్పదు ఎక్కక మెట్ల సిస్టం
యంత్రంపై ఆధారపడితే కాయం
ఊబకాయంతో రోగాలు ఖాయం.

చెమట చుక్క చిందందే కనిపించదు పెరిగే పొలం
పగలు రేయి శ్రమ చేయందే

వినిపించదు పరిశ్రమ కోలాహలం

కాదు కార్మికులు కర్షకులే శ్రమజీవులు
సమయపాలన లేని సాఫ్ట్వేర్ ఉద్యోగులు
కాలాన్ని బట్టి వస్తువులమ్మే చిరుద్యోగులు
అంతా కష్టం విలువ తెలిసిన చిరుజీవులు.

నిరంతరం పనిలో అలిసే అమ్మ
ర్యాంకుల వెంట పరుగుల విద్యార్థులు
ఇంటా బయట కష్టపడే ఉద్యోగినులు
చేయగలమా తక్కువ వీరి పనులు.

కొంకర్లు పోయే చలిలో ఆర్మీ జవానులు
సంఘ భద్రతకు ఆరాటపడే పోలీసులు
రోగికి ఎప్పుడైనా అందుబాటులో ఉండే వైద్యులు
అంతా శ్రమమాతకు ముద్దుబిడ్డలు.

ఏ ఉద్యోగంలోనైనా ఉంటుంది సెలవు
అమ్మకు లేదు రిటైర్మెంట్ కొలువు
అమ్మేగా నిత్య శ్రమజీవి అసలు.

ఎవరి కష్టం తక్కువ కాదు
ఫలితం సమానము కాదు
అయినా కష్టేఫలి అన్నారు పెద్దలు
ఫలించకుంటే మరింత కష్టం పెంచు
సోపానాలతో విజయం సాధించు.

–అరుణ చామర్తి,

## బక్కచిక్కిన కట్టె..!

నరాలు బిగుసుకుంటున్నా
కండరాలు కృంగుతున్నా
ఆశలు ఆవిరవుతున్నా
పేగుల అరుపులు ప్రతిధ్వనిస్తున్నా
ఆగని పయనం అతనిది...
హృదయ స్పందన
శరీర ఉనికిని నిర్ధారిస్తే
స్వేదపు సేద్యమే
మట్టి బతుకు ఉనికికి సాక్ష్యం కదా...
చుట్టూ తిమిరం అలుముకుంటున్నా
లోపల మాత్రం ఎప్పుడూ వెలుతురు పిట్టే..
ఎన్నో కడుపులు నింపుతూ
నిరంతర శ్రామికుడై
చెమట చుక్కల చిందిస్తూనే ఉంటుంది..
ఓటమి రాళ్ళు తగులుతున్నా
అడుగులు తడబడనీయక
పట్టుదల ఔషధం పూసుకుంటూ
విజయ బావుటా ఎగరేయడమే
ఆ బక్క చిక్కిన కట్టె నైజం...!



–యద్రాబత్తిన మునీంద్ర,
8331844527

## శ్రమ వెలుతురు

ప్రజలే కాదు,
దేశంకోసం
మేమూ నిరంతరం
శ్రమిస్తున్నా మంటున్నారు
నాయకులు...
ఎండ వెలుతురు
బల మిస్తుంది,
బతుకు నిస్తుంది...

మంట వెలుతురు
బలం పీలుస్తుంది,
బతుకు కాలుస్తుంది.



–డా. రావి రంగారావు
9247581825

## చెమట చుక్క

రొమ్ము విరచి ,జబ్బలు చరచి
పలుగు పార చేత బట్టి
మండుటెండల్లో
సూర్యుడి వేడి ధాటికి నిలువలేకపోయినా
మలి సంధ్య వేళ వరకు
మనసున మలినం లేకుండా
రక్తాన్ని చెమటగా చిందిస్తూ
కార్మికులై కష్టం చేస్తూ
శ్రామికులై అధికశ్రమను
ఆనందంగా భరిస్తూ
అలసి సొలసి పోయిన
అనుకూల పరిస్థితులు లేకపోయిన
పూరి గుడిసెల్లో
పట్టె మంచాన తల వాల్చి
తనువును తాకిన గాలి స్పర్శకే
సంతోషించేటోల్లం శ్రమజీవులం!

–కిదాల శివకృష్ణ,
9963698405

## శ్రమజీవి

సీస మాలిక:
కష్టము చేసిన కడుపు నిండగలేని
కష్టజీవి కెపుడు కరుణతోడ
లంచగొండితనము లక్ష్యమ్మువీడని
అవినీతినంతయు నార్పివేయ
పండినా పంటకు పాటైన ధరలకై
రైతు కోరికతీర రయముగాను
పట్టాలువున్నను పొట్టనింపగలేని
పోరాట యోధుల పోరు కొరకు
వెంటబడియు నాడపిల్లల వేధించు
కామాంధు పాలిట కత్తిగాను
ప్రజలను భయపెట్టి పాలించు ప్రభువుల
గుండాలకు తుపాకీ గుండుగాను
నోటుతోటి కొనగ ఓటును పెద్దలు
వద్దన్న కానియు గద్దెదిగరు
ఇవి కవిత్వానికి ఇతివృత్తములుగను
కావాలి నిప్పుడు కార్యదీక్ష.

తే.గీ. మా:
పేద జీవుల పాలిట పెన్నిధిగను!
మంచి చెడులనంత నెపుడు నెంచిచూడ!
కలము చేత పట్టి వ్రాయ కత్తి తీరు!
రవియుకాంచని చోటను కవియు గాంచు!
మంచితనము మరువకను పంచగాను!
వినుము కనకయ్య మల్లంల విశ్వ బోధ!



–కనకయ్య మల్లముల,
9440554042

## నాలుగు చెమట చుక్కలొక్కటై

కంకణ బద్ధులై
అలుపెరుగని పోరాటం చేస్తూ
నాలుగు చెమట చుక్కలొక్కటై
మట్టిలో పచ్చదనం నింపుతున్నాయి
దేశం ఆకలితీర్చే వారి చేతులు..

శ్రమ గంధాన్ని కాయమంతా పూసుకుని
కరుకు కొండనుసైతం పిండి చేస్తూ
అందమైన ఆకృతులు సృష్టిస్తున్నాయి
బాధ్యతను తొడిగిన వారిపాదాలు..

నలుగురు గమ్యాన్ని చేరే బాటను నిర్మిస్తూ
నాలుగు చేతులు సాయపు తట్టలై
అభివృద్ధి వారధిని నిర్మిస్తున్నాయి
అర్ధాకలితో పేదరికపు అంచున నిలిచి..

కన్నీటి కడలిలో మునకలు వేస్తున్నా
నిత్యం వినిపించే శ్రమ రాగాలు
అవని విజయ గీతికకు
ఆలంబనగా నిలుస్తున్నాయి
స్వేదపు శ్రుతిని సరిచేసుకుంటూ..



–కాదంబరి
శ్రీనివాసరావు
83281 83581

## స్వేదకావ్యం!

చిన్ననాడు చదువుకు దూరం
పెరిగాక నైపుణ్యం ఆర్థిక భారం!
పగలు సూర్యుడి నీడన
రాతిరి చంద్రుడి జాడన!!

తలపై మట్టితట్ట
చంకన చిట్టి కుట్టి!
పాదరక్షలు ప్రసాదించని
ఉపాధి హామీ!!

కార్మిక హక్కులు లేవు
ధార్మిక చిక్కులు తప్పు!
అనునిత్యం శ్రామిక ఆరాటం
అసంఘటిత రంగ పోరాటం!!

ఆకలి దప్పులు తప్పని స్వేదకావ్యం
అదృష్ట రేఖలు చెప్పని భవితవ్యం!
సాంఘిక అసమానతల తరంగదైర్ఘ్యం
సామాజిక అపశృతుల పౌనఃపున్యం!!



–కరిపె రాజ్ కుమార్,
8125144729

## శ్రమ ఉంటుంది

కలల ఆకాశంలో ఎగిరి ఎగిరి
కన్నీటి వరద లో పడిపోయాను
వరద జోరుగానే ఉంది
సముద్రంలో కల్వకుండ
నా కవిత్వం అడ్డుపడుతుంది.

కవిత్వం అజరామరం
కవిత్వం ఆకాశం
కవిత్వానికి బలమేమిటి
జనం
జనం కన్నీళ్లు జనం చెమట
జనం ధిక్కరణ.

నా గుండె నిలువెల్లా ప్రశ్నలు
అన్నీ ప్రశ్నలే
ప్రశ్నలే కవిత్వమైన రోజు
పిడికిలి ఆకాశమయ్యింది
ప్రశ్న ఈనాటి ధిక్కరణ
చీకటి భారతంలో
సామాన్యుని బతుకు
అమావాస్య ఆర్తనాదమే.

కాలం చిన్నది కావచ్చు
పెద్దది కావచ్చు
చరిత్రలో స్థానం లేకపోవచ్చు
వీరుడు ఉదయించినా
సూర్యుడు రాకపోవచ్చు
చరిత్ర గమనంలో
శ్రమ ఉంటుంది.

చందమామ కొండల్లో దాకోవచ్చు
కెరటం సాగరం
గుండెల్లో ఆడుకోవచ్చు
ఆకాశం వీధిలో
గద్దలు తిరగాడవచ్చు
భవిత పయనంలో
శ్రమ ఉంటుంది.

యుద్ధరంగం జయాపజయాలు
తేల్చకుండా ఖాళీ కావచ్చు
కథనరంగం
కన్నీటి పాలు కావచ్చు
శ్రమ ఉంటుంది
రెక్కల కష్టం మిగిలే ఉంటుంది
ఈ నేల ఉంటుంది
చెమట ఉంటుంది
పోరు పిడికిలి ఉంటుంది
నేల పై పెంచుకున్న
నా....
నమ్మకముంటుంది.



–సిరిసిల్లా గఫూర్
శిక్షక్
9849062038

## శ్రమే విజయానికి మూలం

కాలంతో పరుగెట్టావా
నీకు తిరుగు లేదు
శ్రమని నీ తోడు నీడగా
మలచుకున్నావా
నీకు ఎదురు లేదు
కష్టపడే వాడు
ఎప్పుడూ అపజయాన్ని రుచి చూడడు
విజయాల మెట్లపై
ఉన్నత శిఖరాలను అధిరోహించడమే
అలవాటుగా మారు
చెమటోడ్చే మనిషికి
దొరకనిది ఈ ఇలలో ఉండదు
ఆ ధ్యేయం నీ కర్తవ్యం
ఫలితాలు అమోఘంగా!
మరింకెందుకు ఆలస్యం ?
జయానికి మూలం తెలిసిందిగా
ఇక ఆపకు నీ నడక!



–యలమర్తి
అనూరాధ,
9247260206

## శ్రమ మూలం జగత్తు

శ్రమశక్తిని చూడాలంటే
కొండల్ని చిదిమిన కండల్ని అడుగు
మిద్దెలు మేడలై వెలసిన
స్తూపాల్ని అడుగు
శిలల్ని మలిచిన శిల్పుల్ని అడుగు
చెబుతాయి.
శ్రమ శక్తి గురించి తెలియాలంటే
కండలకొండల మీదినుంచి
చిమ్మిన స్వేదం నదుల్ని అడుగు –
ప్రపంచ పురోభివృద్ధికి
శ్రమావిర్భావమే నాంది
రైతు శ్రమతోనే
ఆదిమ శక్తి ఆవిర్భవించింది
మండు టెండ ఎంత గద్దించినా
నిర్భయంగా ముందడుగేసేది
శ్రమశక్తే
శ్రమశక్తి పడకేస్తే
ప్రపంచ పురోభివృద్ధి తో
మానవాళికి నాస్తి దోస్తీ!



–మాధవీ సనారా,
8639491246

